తెలంగాణ TELANGANA MUCHATLU ముచ్చట్లు
TELTEL/2023/88710
ఎడిటర్ : బొల్లెపాక రాజేష్
తెలుగు దిన పత్రిక
వరంగల్ | మంగళవారం - 19- మే 2026 | సంపుటి : 3 | సంచిక : 351 | పేజీలు - 8 | వెల : రూ 5 | www.telanganamuchatlu.in

# పేరూరులో అగ్నిప్రమాదం.. వంద ధాన్యం బస్తాలు దగ్ధం

గుర్తుతెలియని వ్యక్తుల నిర్లక్ష్యంతో మంటలు వ్యాపించిన ఘటన
రైతుల కష్టార్జితం అగ్నికి ఆహుతి
బాధితులకు ప్రభుత్వ సహాయం అందిస్తామని అధికారుల హామీ




**మెదక్, మే 18 (తెలంగాణ ముచ్చట్లు):** మెదక్ మండలం పేరూరు గ్రామ శివారులో జరిగిన అగ్నిప్రమాదం స్థానికంగా కలకలం రేపింది. ఈ ప్రమాదంలో రైతులు ఎంతో కష్టపడి పండించిన ధాన్యం బస్తాలు మంటల్లో కాలిపోయాయి. అకాలంగా జరిగిన ఈ ఘటనతో బాధిత రైతులు తీవ్ర ఆవేదన వ్యక్తం చేశారు. స్థానికుల సమాచారం ప్రకారం పేరూరు గ్రామ శివారులో కొందరు గుర్తుతెలియని వ్యక్తులు వరి కొయ్యలకు నిప్పు పెట్టినట్లు తెలుస్తోంది. అయితే అక్కడి నుంచి మంటలు గాలి వేగం కారణంగా సమీపంలోని ప్రైవేట్ వెంచర్ ప్రాంతంలోకి వ్యాపించాయి. ఒక్కసారిగా మంటలు విస్తరించడంతో

మిగతా 2లో

# బండి భగీరథ్ పోక్సో కేసు దర్యాప్తు ముమ్మరం

- స్నేహితుల విచారణపై దృష్టి పెట్టిన పోలీసులు
- సాక్షుల వాంగ్మూలాలతో కీలక ఆధారాల సేకరణ
- భగీరథ్ కస్టడీ కోసం కోర్టును ఆశ్రయించే అవకాశం



**హైదరాబాద్, మే 18 (తెలంగాణ ముచ్చట్లు):** బండి భగీరథ్‌పై నమోదైన పోక్సో కేసు దర్యాప్తును పోలీసులు వేగవంతం చేశారు. కేసుకు సంబంధించి ఘటన జరిగిన సమయంలో భగీరథ్‌తో కలిసి ఉన్నట్లు ఫిర్యాదులో పేర్కొన్న అతని స్నేహితులను పోలీసులు విచారణకు పిలిపించారు. మైనర్ బాలిక తల్లి ఫిర్యాదులో పేర్కొన్న వివరాల ఆధారంగా పేట్‌బషీరాబాద్ పోలీసులు ఈ విచారణ చేపట్టారు. సోమవారం పలువురు యువకులను పేట్‌బషీరాబాద్ పోలీస్ స్టేషన్‌కు పిలిపించి ఘటన జరిగిన రోజు ఏం జరిగిందనే విషయాలపై పోలీసులు ఆరా తీశారు. సంఘటన జరిగిన తర్వాత రాజీ ప్రయత్నాలు జరిగాయా, ఎవరెవరు పాల్గొన్నారు, ఘటనకు ముందు తర్వాత పరిస్థితులు ఎలా ఉన్నాయనే అంశాలపై ప్రశ్నించినట్లు సమాచారం. అనంతరం వారి వాంగ్మూలాలను నమోదు చేసినట్లు తెలుస్తోంది.
ఈ కేసులో దర్యాప్తు భాగంగా పోలీసులు ఆధారాల సేకరణకు ప్రత్యేక ప్రాధాన్యం ఇస్తున్నారు. ఇప్పటికే భగీరథ్‌ను అరెస్టు చేసిన అనంతరం దాదాపు రెండు గంటల పాటు విచారించి అతడి వాంగ్మూలాన్ని నమోదు చేసిన విషయం తెలిసిందే. కేసు నమోదైన తర్వాత ఎందుకు కనిపించలేదనే అంశంపై కూడా పోలీసులు ప్రశ్నించినట్లు సమాచారం. విచారణ సందర్భంగా తన వద్ద ఉన్న కొన్ని ఆధారాలను భగీరథ్ సమర్పించినట్లు సమాచారం. తాను ఎలాంటి తప్పు చేయలేదని కూడా పోలీసులకు

మిగతా 2లో



# టీఆర్ఎస్ జెండా గద్దె నమూనా ఆవిష్కరణ

## రాష్ట్రవ్యాప్తంగా ఒకే నమూనాలో జెండా గద్దెల నిర్మాణం

- నెల రోజుల పాటు జెండా పండుగ నిర్వహణకు పిలుపు
- పార్టీ శ్రేణులకు దిశానిర్దేశం చేసిన కల్వకుంట్ల కవిత




హైదరాబాద్, మే 18 (తెలంగాణ ముచ్చట్లు): తెలంగాణ రక్షణ సేన పార్టీ బలోపేతం, పార్టీ గుర్తింపును గ్రామ స్థాయి వరకు తీసుకెళ్లే లక్ష్యంతో జెండా గద్దెల నిర్మాణంపై పార్టీ అధ్యక్షురాలు కల్వకుంట్ల కవిత కీలక ప్రకటన చేశారు. బంజారాహిల్స్‌లోని తెలంగాణ రక్షణ సేన పార్టీ కార్యాలయంలో నిర్వహించిన రాష్ట్ర సాధారణ మండలి సమావేశంలో పార్టీ జెండా గద్దె నమూనాను ఆవిష్కరించారు. రాష్ట్రవ్యాప్తంగా ఒకే నమూనాలో జెండా గద్దెలను నిర్మించనున్నట్లు ప్రకటించారు. ఈ సందర్భంగా కల్వకుంట్ల కవిత మాట్లాడుతూ పార్టీ భావజాలం, సిద్ధాంతాలు ప్రజల్లోకి బలంగా తీసుకెళ్లాలంటే పార్టీకి ప్రత్యేక గుర్తింపు అవసరమని పేర్కొన్నారు. రాష్ట్రంలోని ప్రతి గ్రామం, ప్రతి పట్టణంలో ఒకే తరహా నమూనాలో జెండా గద్దెలు ఏర్పాటు చేస్తే పార్టీకి ప్రత్యేక గుర్తింపు లభిస్తుందని అభిప్రాయపడ్డారు. పార్టీ కార్యక్రమాలు ఎక్కడ జరిగినా ఒకే రూపకల్పన కనిపించేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. జెండా గద్దె నిర్మాణానికి సంబంధించి ప్రత్యేక నమూనాను పార్టీ సిద్ధం చేసిందని తెలిపారు.

మిగతా 2లో

# కేబీఆర్ ఫ్లైఓవర్‌పై సుప్రీంకోర్టు ఆదేశాలు

- చెట్ల తొలగింపుపై తాత్కాలిక నిలుపుదల
- పర్యావరణ పరిరక్షణపై కీలక వ్యాఖ్యలు
- జూలై ఇరవై ఏడుకు విచారణ వాయిదా



న్యూఢిల్లీ, మే 18 (తెలంగాణ ముచ్చట్లు): హైదరాబాద్‌లోని కేబీఆర్ పార్కు సమీపంలో ప్రతిపాదిత ఫ్లైఓవర్ నిర్మాణానికి సంబంధించి సుప్రీంకోర్టులో కీలక విచారణ జరిగింది. తదుపరి విచారణ జరిగే వరకు చెట్లను నరికివేయవద్దని సుప్రీంకోర్టు ఆదేశాలు జారీ చేసింది. పర్యావరణపరంగా సున్నిత ప్రాంతాల్లో నిర్మాణ పనులు చేపట్టేటప్పుడు ప్రత్యేక జాగ్రత్తలు తీసుకోవాలని కోర్టు సూచించింది. విచారణ సందర్భంగా పార్కు పరిధిలోని ఇరవై ఐదు నుంచి ముప్పై మీటర్ల పరిధిలో ఉన్న చెట్లను తొలగించవద్దని న్యాయస్థానం స్పష్టం చేసింది. ఈ ప్రాజెక్టు కోసం దాదాపు వెయ్యి మూడు వందల చెట్లను నరికివేయబోతున్నారని పిటిషనర్ల తరపు న్యాయవాది కోర్టు దృష్టికి




## మహా న్యూస్ వంశీపై తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేసిన ఆర్ఎస్ ప్రవీణ్ కుమార్

**హైదరాబాద్,మే18(తెలంగాణ ముచ్చట్లు):**

మహా న్యూస్ ఛానల్ నిర్వహించిన పోల్‌పై మాజీ ఐపీఎస్ ఆర్ఎస్ ప్రవీణ్ కుమార్ తీవ్రంగా స్పందించారు. “తన కొడుకులు మంచి వాళ్లేనా” అంటూ నిర్వహించిన పోల్‌ను తీవ్రంగా ఖండించారు. ఈ సందర్భంగా మహా న్యూస్ వంశీని ఉద్దేశించి తీవ్ర వ్యాఖ్యలు చేశారు. “ఈసారి నిన్ను బండి సంజయ్, రేవంత్ రెడ్డి కూడా కాపాడలేరు. మీ సామాన్లు సర్దుకోండి.. చంచల్‌గూడ జైలులో గోదావరి బ్యారక్ మీ కోసం సిద్ధంగా ఉంటుంది. జైలులో చిప్పకూడు తింటూ నీ చేసిన పనులపై ఆలోచించాల్సి వస్తుంది” అంటూ వ్యాఖ్యానించారు.
అలాగే, “రేవంత్ రెడ్డి, కిషన్ రెడ్డి, ఓవైసీ, చంద్రబాబు నాయుడు కుటుంబ సభ్యులపై ఇలాంటి పోల్స్ నిర్వహించే ధైర్యం ఉందా?” అని ప్రశ్నించారు. మహా న్యూస్ వ్యవహార శైలిపై ఆయన తీవ్ర అభ్యంతరం వ్యక్తం చేశారు.

## సరస్వతి అంత్య పుష్కరాలకు గవర్నర్‌కు ఆహ్వానం

- లోక్ భవన్‌లో గవర్నర్‌ను కలిసిన కొండా సురేఖ
- మే 21 నుంచి జూన్ 1 వరకు పుష్కరాలు
- ఎండోమెంట్స్ అధికారులతో కలిసి మర్యాదపూర్వక భేటీ

**హైదరాబాద్, మే 18 (తెలంగాణ ముచ్చట్లు):** పర్యావరణ, అటవీ శాఖలతో పాటు దేవాదాయ శాఖ మంత్రిగా బాధ్యతలు నిర్వహిస్తున్న కొండా సురేఖ సోమవారం లోక్ భవన్‌లో గవర్నర్ శివప్రతాప్ శుక్లాను మర్యాదపూర్వకంగా కలిశారు. రానున్న సరస్వతి అంత్య పుష్కరాలకు హాజరు కావాలని ఆమె గవర్నర్‌ను ఆహ్వానించారు. మే 21 నుంచి జూన్ 1, 2026 వరకు నిర్వహించనున్న సరస్వతి అంత్య పుష్కరాల సందర్భంగా గవర్నర్‌కు అధికారిక ఆహ్వానం అందజేశారు. పుష్కరాల నిర్వహణకు ప్రభుత్వం విస్తృత ఏర్పాట్లు చేపడుతున్నట్లు ఈ సందర్భంగా వివరించారు. మంత్రి కొండా సురేఖతో పాటు

మిగతా 2లో



# తెలంగాణకు చల్లటి కబురు

- నేడు, రేపు పలు జిల్లాల్లో వర్షాలు
- ఉపరితల ఆవర్తన ప్రభావంతో వాతావరణ మార్పులు
- ఎల్లుండి నుంచి మళ్లీ పెరగనున్న ఎండల తీవ్రత




**హైదరాబాద్, మే 18 (తెలంగాణ ముచ్చట్లు):** భానుడి భగభగలతో ఉక్కిరిబిక్కిరవుతున్న తెలంగాణ ప్రజలకు వాతావరణ శాఖ కాస్త ఊరటనిచ్చే సమాచారం వెల్లడించింది. రాష్ట్రంలో ఉపరితల చక్రవాత ఆవర్తన ప్రభావంతో నేడు, రేపు తేలికపాటి నుంచి మోస్తరు వర్షాలు కురిసే అవకాశం ఉందని హైదరాబాద్ వాతావరణ కేంద్రం తెలిపింది. గత కొన్ని రోజులుగా తీవ్ర ఎండలతో ఇబ్బంది పడుతున్న ప్రజలకు ఈ వర్షాలు కొంత ఉపశమనం కలిగించే అవకాశం ఉందని అధికారులు పేర్కొన్నారు. వాతావరణ శాఖ అంచనాల ప్రకారం హైదరాబాద్‌తో పాటు భద్రాద్రి కొత్తగూడెం, నల్లగొండ, వికారాబాద్, మహబూబ్‌నగర్, కామారెడ్డి, మల్కాజిగిరి, రంగారెడ్డి, వనపర్తి, గద్వాల జిల్లాల్లో వర్షాలు కురిసే అవకాశం ఉంది. కొన్ని ప్రాంతాల్లో ఉరుములు, ఈదురుగాలులతో కూడిన వర్షాలు పడే అవకాశమున్నట్లు అధికారులు తెలిపారు.

మిగతా 2లో

తెలంగాణ ముచ్చట్లు TELANGANA MUCHATLU
ఎడిటర్ : బొల్లెపాక రాజేష్
తెలుగు దిన పత్రిక

# పేరూరులో అగ్నిప్రమాదం.. వంద ధాన్యం బస్తాలు దగ్ధం

(మొదటి పేజీ తరువాయి)



అక్కడ నిల్వ చేసిన ధాన్యం బస్తాలకు నిప్పు అంటుకుంది. తూకం వేసి విక్రయానికి సిద్ధంగా ఉంచిన రైతులు సిద్ధిరాములు, పోచయ్యకు చెందిన సుమారు వంద ధాన్యం బస్తాలు ఈ ప్రమాదంలో పూర్తిగా దగ్ధమయ్యాయి. కళ్లముందే పంట అగ్నికి ఆహుతి కావడంతో రైతులు కన్నీటి పర్యంతమయ్యారు. ఎంతో శ్రమించి పండించిన పంట ఇలా కాలిపోవడంతో తీవ్ర ఆవేదన వ్యక్తం చేశారు.

సమాచారం అందుకున్న అగ్నిమాపక సిబ్బంది వెంటనే ఘటనాస్థలికి చేరుకుని మంటలను అదుపులోకి తీసుకువచ్చారు. మరింత విస్తరించకుండా వేగంగా చర్యలు చేపట్టడంతో సమీప ప్రాంతాలకు ప్రమాదం తప్పినట్లు అధికారులు తెలిపారు. ఘటనపై రెవెన్యూ అధికారులు కూడా స్పందించారు. తహశీల్దార్ సంఘటన స్థలాన్ని పరిశీలించి బాధిత రైతులతో మాట్లాడారు. నష్టాన్ని అంచనా వేసి ప్రభుత్వపరంగా అవసరమైన సహాయం అందిస్తామని హామీ ఇచ్చారు. ఇటీవల వరుసగా జరుగుతున్న అగ్నిప్రమాదాల నేపథ్యంలో రైతులు అప్రమత్తంగా ఉండాలని అధికారులు సూచిస్తున్నారు. పొలాల్లో ఎక్కడైనా మంటలు వెలిగించే సమయంలో జాగ్రత్తలు తీసుకోవాలని, నిర్లక్ష్యం కారణంగా ఇలాంటి ప్రమాదాలు జరగకుండా చూడాలని విజ్ఞప్తి చేశారు.

# బండి భగీరథ్ పోక్సో కేసు దర్యాప్తు ముమ్మరం

(మొదటి పేజీ తరువాయి)

వివరించినట్లు తెలుస్తోంది. మరోవైపు బాధితురాలి తల్లి ఫిర్యాదు, ఆమె ఇచ్చిన వాంగ్మూలం ఆధారంగా పోలీసులు వివిధ ప్రశ్నలు సంధించి వివరాలు సేకరించారు. బాధితురాలు ఇచ్చిన వాంగ్మూలం, భగీరథ్ ఇచ్చిన వివరణలను పోలీసులు పరస్పరం పరిశీలిస్తున్నట్లు సమాచారం. అనంతరం భగీరథ్‌కు వైద్య పరీక్షలు నిర్వహించి న్యాయమూర్తి ముందు హాజరుపరిచిన పోలీసులు అతడిని చర్లపల్లి జైలుకు తరలించారు. ఇక పూర్తిస్థాయి విచారణ కోసం భగీరథ్‌ను కస్టడీకి తీసుకోవాలని పోలీసులు భావిస్తున్నట్లు తెలుస్తోంది. ఇందుకోసం కోర్టులో పిటిషన్ దాఖలు చేసేందుకు సన్నాహాలు చేస్తున్నట్లు సమాచారం. ఈ కేసులో సాక్షుల వాంగ్మూలాలు కీలకంగా మారనున్నాయి.

ఇప్పటికే బాధితురాలు, ఆమె తల్లి, భగీరథ్ వాంగ్మూలాలు నమోదు కాగా, సాక్షులు ఇచ్చే వివరాల ఆధారంగా కేసు దిశ మారే అవకాశాలు ఉన్నాయని దర్యాప్తు వర్గాలు భావిస్తున్నాయి. మరోవైపు మొయినాబాద్ ప్రాంతంలోని రెండు ఫామ్‌హౌస్‌లు, నానక్‌రాంగూడలోని సర్వీస్ అపార్టుమెంట్‌ల నుంచి పోలీసులు పలు ఆధారాలు సేకరించినట్లు సమాచారం. ఈ కేసులో మైనర్ బాలిక న్యాయమూర్తి ఎదుట ఇచ్చిన వాంగ్మూలాన్ని పోలీసులు అత్యంత కీలక ఆధారంగా పరిగణిస్తున్నారు. పోక్సో కేసుల్లో కోర్టు సమక్షంలో ఇచ్చే వాంగ్మూలం విచారణలో ప్రధాన పాత్ర పోషిస్తుందని న్యాయ నిపుణులు పేర్కొంటున్నారు. ప్రస్తుతం సాంకేతిక ఆధారాలు, సాక్షుల వివరాలు, వాంగ్మూలాల ఆధారంగా పోలీసులు దర్యాప్తును ముందుకు తీసుకెళ్తున్నారు.

# తెలంగాణకు చల్లటి కబురు

(మొదటి పేజీ తరువాయి)



గత కొన్ని రోజులుగా రాష్ట్రవ్యాప్తంగా ఉష్ణోగ్రతలు భారీగా నమోదవుతున్నాయి. మధ్యాహ్న సమయంలో ప్రజలు బయటకు రావడానికి కూడా ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ఈ పరిస్థితుల్లో వర్షాలు కురవడం వల్ల ఉష్ణోగ్రతలు కొంత మేర తగ్గే అవకాశం ఉందని వాతావరణ నిపుణులు భావిస్తున్నారు. అయితే ఈ ఉపశమనం తాత్కాలికమేనని అధికారులు హెచ్చరిస్తున్నారు. ఎల్లుండి నుంచి రాష్ట్రంలో మళ్లీ ఎండల తీవ్రత పెరిగే అవకాశం ఉందని వాతావరణ శాఖ స్పష్టం చేసింది. పలు జిల్లాల్లో అధిక ఉష్ణోగ్రతలు నమోదయ్యే అవకాశం ఉండటంతో రెడ్ అలర్ట్ కూడా జారీ చేశారు. ఎండల ప్రభావం అధికంగా ఉండే అవకాశాల నేపథ్యంలో ప్రజలు అప్రమత్తంగా ఉండాలని అధికారులు సూచించారు. అత్యవసరమైతే తప్ప మధ్యాహ్న సమయంలో బయటకు వెళ్లకూడదని, బయటకు వెళ్లాల్సి వస్తే తగిన జాగ్రత్తలు తీసుకోవాలని తెలిపారు.

వేసవి తీవ్రత దృష్ట్యా ఎక్కువగా నీరు తాగడం, శరీరాన్ని చల్లగా ఉంచుకోవడం, చిన్నారులు, వృద్ధులు ప్రత్యేక జాగ్రత్తలు తీసుకోవడం అవసరమని సూచించారు. రానున్న రోజుల్లో వాతావరణ పరిస్థితులపై ప్రజలు అప్రమత్తంగా ఉండాలని అధికారులు కోరారు.

# కేబీఆర్ ఫ్లైఓవర్‌పై సుప్రీంకోర్టు ఆదేశాలు

(మొదటి పేజీ తరువాయి)




తీసుకువచ్చారు. చెట్ల తొలగింపుకు బదులుగా ప్రత్యామ్నాయ ప్రణాళికలు పరిశీలించారా అని న్యాయస్థానం ప్రశ్నించింది. చెట్లు నరకకుండా నిర్మాణ పనులు చేపట్టే అవకాశం ఉందా అనే అంశంపై కూడా వివరణ కోరింది. అయితే అలాంటి ప్రణాళిక ప్రస్తుతం లేదని పిటిషనర్ల తరఫు న్యాయవాది కోర్టుకు తెలిపారు.

ప్రభుత్వం రాత్రి, పగలు అనే తేడా లేకుండా చెట్ల తొలగింపు చేపడుతోందని పిటిషనర్లు ఆరోపించారు. పర్యావరణానికి తీవ్ర నష్టం కలిగే అవకాశం ఉందని కోర్టు దృష్టికి తీసుకువచ్చారు. దీనిపై సుప్రీంకోర్టు తీవ్రంగా స్పందించినట్లు సమాచారం. వాదనలు విన్న అనంతరం రాష్ట్ర ప్రభుత్వం, కేంద్ర పర్యావరణ శాఖను ప్రతివాదులుగా చేర్చి నోటీసులు జారీ చేసింది. ఈ అంశంపై పూర్తి వివరాలు సమర్పించాలని ఆదేశించింది. ఈ కేసులో తదుపరి విచారణను జూలై ఇరవై ఏడుకు వాయిదా వేసింది. అప్పటి వరకు చెట్ల తొలగింపుపై ఆంక్షలు కొనసాగనున్నాయి. ఈ పరిణామం పర్యావరణ పరిరక్షణకు సంబంధించిన వర్గాల్లో చర్చనీయాంశంగా మారింది.

# టీఆర్ఎస్ జెండా గద్దె నమూనా ఆవిష్కరణ

(మొదటి పేజీ తరువాయి)




మూడు అడుగుల ఎత్తు, రెండు అడుగుల వెడల్పుతో జెండా గద్దెలను నిర్మించాలని సూచించారు. బేస్ భాగం ఒక అడుగు ఎత్తుతో ఉండగా, పై భాగం రెండు అడుగుల ఎత్తుతో నిర్మించాలని పేర్కొన్నారు. ప్రతి నియోజకవర్గం, మండలం, గ్రామ స్థాయిలో ఒకే కొలతలు పాటించాలని పార్టీ శ్రేణులకు ఆదేశించారు. జెండా గద్దె రూపకల్పనలో రంగులకు కూడా ప్రత్యేక ప్రాధాన్యం ఇచ్చినట్లు వివరించారు. బేస్ భాగానికి ఆకుపచ్చ రంగు ఉపయోగించాలని, పై భాగానికి పసుపు రంగు వినియోగించాలని సూచించారు. మధ్యలో నీలం రంగులో తెలంగాణ రాష్ట్ర పటాన్ని ఏర్పాటు చేయాలని, దాని మధ్యలో ఆంగ్ల అక్షరాల్లో టీఆర్ఎస్ అని రాయాలని పేర్కొన్నారు. అలాగే బేస్ భాగంలో తెలుగులో తెలంగాణ రక్షణ సేన అని స్పష్టంగా కనిపించేలా రాయాలని సూచించారు.

రాష్ట్రవ్యాప్తంగా జెండా గద్దెలు, పార్టీ జెండాలు అన్నీ ఒకే రంగు కోడ్ ప్రకారం ఉండాలని కల్వకుంట్ల కవిత స్పష్టం చేశారు. పార్టీ నిర్దేశించిన రంగులనే ఉపయోగించాలని, అప్పుడే రాష్ట్రవ్యాప్తంగా ఏకరూపత సాధ్యమవుతుందని పేర్కొన్నారు. పార్టీ గుర్తింపును బలోపేతం చేయడానికి ఇది కీలకమని చెప్పారు. పార్టీ శ్రేణుల్లో ఉత్సాహాన్ని నింపేందుకు ఈ నెల ఇరవై తేదీ నుంచి జూన్ ఇరవై వరకు నెల రోజుల పాటు జెండా పండుగ నిర్వహించాలని సూచించారు. రాష్ట్రవ్యాప్తంగా అన్ని నియోజకవర్గాలు, మండలాలు, గ్రామాల్లో ఈ కార్యక్రమాలను ఘనంగా నిర్వహించాలని పిలుపునిచ్చారు. పార్టీ జెండా పండుగ ద్వారా తెలంగాణ రక్షణ సేన భావజాలాన్ని ప్రజల్లోకి తీసుకెళ్లాలని సూచించారు. సమావేశంలో పాల్గొన్న పార్టీ నాయకులు, కార్యకర్తలు జెండా గద్దె నమూనాను పరిశీలించి తమ అభిప్రాయాలను వ్యక్తం చేశారు. పార్టీని క్షేత్రస్థాయిలో మరింత బలోపేతం చేసేందుకు ఈ కార్యక్రమాలు దోహదపడతాయని అభిప్రాయపడ్డారు. సమావేశంలో పలువురు రాష్ట్ర నాయకులు, జిల్లా ప్రతినిధులు, పార్టీ శ్రేణులు పాల్గొన్నారు.

# సరస్వతి అంత్య పుష్కరాలకు గవర్నర్‌కు ఆహ్వానం

(మొదటి పేజీ తరువాయి)



దేవాదాయ శాఖ ముఖ్య కార్యదర్శి శైలజా రామయ్యర్, శాఖ కమిషనర్ హనుమంతరావు కూడా ఈ సమావేశంలో పాల్గొన్నారు. పుష్కరాల ప్రాధాన్యం, నిర్వహణ ఏర్పాట్లపై వారు గవర్నర్‌కు వివరించినట్లు సమాచారం. సరస్వతి అంత్య పుష్కరాలు భక్తులకు ఆధ్యాత్మికంగా ఎంతో ప్రాముఖ్యత కలిగిన వేడుకగా భావిస్తారని అధికారులు తెలిపారు. భక్తులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా అవసరమైన సదుపాయాలు కల్పించేందుకు ప్రభుత్వం చర్యలు చేపడుతోందని పేర్కొన్నారు. పుష్కరాల సమయంలో లక్షలాది మంది భక్తులు పాల్గొనే అవకాశం ఉన్నందున భద్రత, రవాణా, తాగునీరు, వైద్య సేవలు తదితర అంశాలపై ప్రత్యేక దృష్టి సారిస్తున్నట్లు వెల్లడించారు. గవర్నర్‌తో జరిగిన ఈ భేటీ సానుకూల వాతావరణంలో సాగింది. పుష్కరాల విజయవంత నిర్వహణకు అన్ని శాఖలు సమన్వయంతో పనిచేయాలని అధికారులు అభిప్రాయపడ్డారు.

# ఓటర్ల మ్యాపింగ్ వేగవంతం చేయాలి

- **సనత్‌నగర్‌లో ఎన్నికల అధికారుల సమీక్ష**
- **జూలై ఇరవై ఐదు నుంచి ప్రత్యేక సవరణ కార్యక్రమం**
- **ఇంటింటి సర్వేతో మ్యాపింగ్ పూర్తి చేయాలని ఆదేశం**

**హైదరాబాద్, మే 18 (తెలంగాణ ముచ్చట్లు):** ఓటర్ల జాబితా ప్రత్యేక సవరణ కార్యక్రమాన్ని సమర్థవంతంగా నిర్వహించేందుకు ఎన్నికల అధికారులు ప్రత్యేక దృష్టి సారించాలని అదనపు ప్రధాన ఎన్నికల అధికారి డాక్టర్ వాసం వెంకటేశ్వర్ రెడ్డి సూచించారు. సనత్‌నగర్ అసెంబ్లీ నియోజకవర్గ ఎన్నికల నమోదు అధికారి కార్యాలయంలో నిర్వహించిన సమీక్ష సమావేశంలో ఆయన బీఎల్‌వోలు, సహాయ ఎన్నికల నమోదు అధికారులు, పర్యవేక్షకులతో సమావేశమయ్యారు. ఈ సందర్భంగా మాట్లాడిన ఆయన భారత ఎన్నికల సంఘం మూడో దశ ప్రత్యేక ఇంటెన్సివ్ రివిజన్ షెడ్యూల్ ప్రకటించిందని తెలిపారు. తెలంగాణలో ఈ కార్యక్రమం జూలై ఇరవై ఐదు నుంచి ప్రారంభమవుతుందని వెల్లడించారు. ప్రతి అర్హత కలిగిన పౌరుడు ఓటరు జాబితాలో నమోదు కావడమే ఈ కార్యక్రమం ప్రధాన లక్ష్యమని పేర్కొన్నారు.

ఓటరు జాబితాలో అర్హుల పేర్లు మాత్రమే ఉండేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. రెండు వేల ఇరవై ఐదు ఓటర్ల జాబితాలో ఉన్న అర్హులైన ఓటర్లను రెండు వేల రెండు జాబితాతో అనుసంధానం చేయాలని అధికారులకు ఆదేశించారు. అర్హత లేని పేర్లను తొలగించడంపై కూడా దృష్టి పెట్టాలని సూచించారు. పట్టణ ప్రాంతాల్లో ఓటర్ల మ్యాపింగ్ ప్రక్రియ నెమ్మదిగా సాగుతోందని ఆందోళన వ్యక్తం చేశారు. బీఎల్‌వోలు ఇంటింటికి వెళ్లి వివరాలు సేకరించాలని, రాజకీయ పార్టీల బూత్ స్థాయి ప్రతినిధుల సహాయం తీసుకోవాలని సూచించారు. రెసిడెన్షియల్ వెల్ఫేర్ సంఘాలతో సమావేశాలు నిర్వహించి ప్రజల్లో అవగాహన పెంచాలని అన్నారు.

గైర్హాజరైన, ప్రాంతం మారిన, మరణించిన ఓటర్లను గుర్తించి ఎన్నికల సంఘం నిబంధనల ప్రకారం చర్యలు తీసుకోవాలని తెలిపారు. అలాగే ప్రముఖులు, అత్యంత ప్రముఖుల ఓటర్ల వివరాలను కూడా ప్రత్యేకంగా గుర్తించాలని అధికారులను ఆదేశించారు. సనత్‌నగర్ నియోజకవర్గంలో ఓటర్ల మ్యాపింగ్ ప్రక్రియ మరింత వేగవంతం చేయాలని సూచించిన ఆయన, అధికారులు సమన్వయంతో పనిచేయాలని పేర్కొన్నారు. సమావేశంలో ఎన్నికల అధికారులు, బీఎల్‌వో పర్యవేక్షకులు, ఇతర సిబ్బంది పాల్గొన్నారు.



# ప్రపంచ సాంకేతికతతో విపత్తు వ్యవస్థ బలోపేతం

- **హైదరాబాద్‌లో భారీ మాక్ డ్రిల్ ప్రారంభం**
- **'గోల్డెన్ అవర్' ప్రాధాన్యంపై మంత్రి పొంగులేటి వ్యాఖ్యలు**
- **అత్యాధునిక సాంకేతికతతో రక్షణ చర్యలపై దృష్టి**





**హైదరాబాద్, మే 18 (తెలంగాణ ముచ్చట్లు):** ప్రకృతి విపత్తుల సమయంలో ప్రజల ప్రాణాలను కాపాడటం, ఆస్తి నష్టాన్ని వీలైనంత వరకు తగ్గించడమే ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని రాష్ట్ర రెవెన్యూ, గృహ నిర్మాణ, సమాచార పౌర సంబంధాల శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి తెలిపారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సూచనల మేరకు ప్రపంచస్థాయి సాంకేతికతతో రాష్ట్ర విపత్తు రక్షణ వ్యవస్థను మరింత బలోపేతం చేస్తున్నామని స్పష్టం చేశారు.

రాష్ట్రవ్యాప్తంగా నిర్వహిస్తున్న విపత్తు నిర్వహణ మాక్ కసరత్తుల్లో భాగంగా హైదరాబాద్ నెక్లెస్ రోడ్ హెచ్‌ఎండీఏ మైదానంలో సోమవారం నిర్వహించిన భారీ మాక్ డ్రిల్‌ను మంత్రి ప్రారంభించారు. అనంతరం కమాండ్ కంట్రోల్ కేంద్రంలో వివిధ శాఖల ఉన్నతాధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించి విపత్తు నిర్వహణలో చేపట్టాల్సిన చర్యలపై చర్చించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ ఇతర రాష్ట్రాల్లో అమలవుతున్న అత్యుత్తమ విధానాలను అధ్యయనం చేసి తెలంగాణలో మరింత సమర్థవంతమైన విపత్తు నిర్వహణ వ్యవస్థను రూపొందించనున్నట్లు తెలిపారు. వరదలు, అగ్నిప్రమాదాలు, పారిశ్రామిక ప్రమాదాలు వంటి అత్యవసర పరిస్థితులను ఎదుర్కోవడానికి ప్రపంచవ్యాప్తంగా అందుబాటులో ఉన్న అత్యాధునిక సాంకేతిక పరికరాల వివరాలతో సమగ్ర నివేదిక సిద్ధం చేయాలని అధికారులను ఆదేశించారు.

ప్రకృతి విపత్తులు సంభవించినప్పుడు తొలి గంట అత్యంత కీలకమని, దానిని 'గోల్డెన్ అవర్'గా పరిగణించాలని మంత్రి పేర్కొన్నారు. ఆ సమయంలో సిబ్బంది పూర్తి సమన్వయంతో పనిచేస్తూ అత్యాధునిక పరికరాలను వినియోగించి ప్రజలకు తక్షణ సేవలు అందించాలన్నారు. ప్రమాద సమాచారం అందిన వెంటనే సరైన ప్రాంతానికి వేగంగా చేరుకుని సహాయక చర్యలు చేపట్టడం అధికారుల బాధ్యత అని స్పష్టం చేశారు. వరదలు, అగ్నిప్రమాదాలు, ఆకస్మిక ప్రమాదాల సమయంలో ప్రజలను సురక్షిత ప్రాంతాలకు తరలించడం, సహాయక చర్యలను వేగవంతం చేయడం కోసం ఇలాంటి మాక్ డ్రిల్‌లు ఎంతో ఉపయోగపడతాయని మంత్రి తెలిపారు. గతంలో హైదరాబాద్‌లో సంభవించిన మహావరదలు, గోదావరి-కృష్ణా వరదలను ప్రస్తావిస్తూ విపత్తుల విషయంలో అప్రమత్తత ఎంత అవసరమో చరిత్ర చెబుతోందన్నారు.

మాక్ డ్రిల్‌లో భాగంగా గాలితో నింపే లైఫ్ బోట్లు, నీటిలో చిక్కుకున్న వారిని రక్షించే అత్యాధునిక పద్ధతులు, అత్యవసర తరలింపు చర్యలు, రెస్క్యూ ఆపరేషన్‌లను ప్రత్యేక బృందాలు ప్రదర్శించాయి. కార్యక్రమంలో విపత్తు నిర్వహణ శాఖ, ఎన్‌డీఆర్‌ఎఫ్, ఎస్‌డీఆర్‌ఎఫ్, అగ్నిమాపక, పోలీస్, వైద్య ఆరోగ్య, జీహెచ్‌ఎంసీ తదితర శాఖల అధికారులు, సిబ్బంది పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.



తెలంగాణ ముచ్చట్లు
TELANGANA MUCHATLU
ఎడిటర్ : బొల్లెపాక రాజేష్
తెలుగు దిన పత్రిక



# కేరళ సీఎంకు కోమటిరెడ్డి శుభాకాంక్షలు




- నూతన మంత్రివర్గానికీ అభినందనలు
- ప్రజల విశ్వాసానికి నిదర్శనమని వ్యాఖ్య
- సమగ్ర పాలన అందించాలని ఆకాంక్ష

**హైదరాబాద్, మే 18 (తెలంగాణ ముచ్చట్లు):** కేరళ ముఖ్యమంత్రిగా బాధ్యతలు స్వీకరించిన వీడీ సతీశన్‌కు రాష్ట్ర మంత్రి కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి శుభాకాంక్షలు తెలిపారు. కొత్తగా బాధ్యతలు చేపట్టిన మంత్రివర్గ సభ్యులందరికీ అభినందనలు తెలియజేస్తూ సామాజిక మాధ్యమాల వేదికగా సందేశం విడుదల చేశారు. ఈ సందర్భంగా కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి మాట్లాడుతూ కేరళ ప్రజలు ఇచ్చిన చారిత్రాత్మక తీర్పు ప్రజాస్వామ్య విలువలపై ఉన్న విశ్వాసానికి నిదర్శనమని పేర్కొన్నారు. ప్రజల ఆకాంక్షలు, ఆశయాలకు అనుగుణంగా కొత్త ప్రభుత్వం ముందుకు సాగాలని ఆకాంక్షించారు. యునైటెడ్ డెమోక్రటిక్ ఫ్రంట్‌కు లభించిన ఈ విజయానికి ప్రజల విశ్వాసమే ప్రధాన కారణమని ఆయన అభిప్రాయపడ్డారు. సమగ్ర అభివృద్ధి, ప్రజా సంక్షేమానికి ప్రాధాన్యం ఇచ్చే దిశగా ప్రభుత్వం పనిచేయాలని సూచించారు. ప్రజాస్వామ్య, సమగ్ర భావజాలంతో ముందుకు వెళ్లాలన్న సంకల్పానికి ఈ విజయం ప్రతిబింబమని పేర్కొన్నారు. కొత్త ప్రభుత్వం ప్రజల అంచనాలను అందుకునేలా పాలన అందించాలని కోరారు. రాష్ట్ర అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాల్లో నూతన ప్రభుత్వం సమర్ధవంతంగా ముందుకు సాగాలని ఆకాంక్షించారు. ప్రజల విశ్వాసాన్ని నిలబెట్టేలా పాలన సాగించాలని సూచించారు. కేరళ కొత్త ప్రభుత్వం విజయవంతమైన పాలన అందించి రాష్ట్రాన్ని అభివృద్ధి దిశగా తీసుకెళ్లాలని కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి ఆశాభావం వ్యక్తం చేశారు. రాబోయే రోజుల్లో ప్రభుత్వం మరిన్ని విజయాలు సాధించాలని ఆకాంక్షించారు.

## సత్తుపల్లి–హైదరాబాద్‌కు లహరి బస్సు సేవలు

- సూపర్ లగ్జరీ చార్జీతో నాన్‌ఏసీ స్లీపర్ కమ్ సీటర్ సౌకర్యం.



**సత్తుపల్లి, మే 18(తెలంగాణ ముచ్చట్లు):** సత్తుపల్లి నుండి హైదరాబాద్‌కు, హైదరాబాద్ నుండి సత్తుపల్లికి ప్రయాణికుల సౌకర్యార్థం లహరి నాన్‌ఏసీ స్లీపర్ కమ్ సీటర్ బస్సు సేవలను అందుబాటులోకి తీసుకొచ్చినట్లు సత్తుపల్లి డిపో మేనేజర్ గురజాల లక్ష్మీనారాయణ తెలిపారు. సోమవారం విడుదల చేసిన ప్రకటనలో ఆయన వివరాలు వెల్లడించారు. సత్తుపల్లి నుండి హైదరాబాద్‌కు 8885 సర్వీస్ నంబర్‌తో ప్రతి రోజు రాత్రి 11:15 గంటలకు బస్సు బయలుదేరుతుందని తెలిపారు. అలాగే హైదరాబాద్ బీహెచ్‌ఈఎల్ నుండి సత్తుపల్లికి 8886 సర్వీస్ నంబర్‌తో రాత్రి 9 గంటలకు బస్సు నడుస్తుందని పేర్కొన్నారు. ఈ బస్సులో సూపర్ లగ్జరీ చార్జీతో ప్రయాణించే అవకాశం కల్పించినట్లు చెప్పారు. వేసవి కాలాన్ని దృష్టిలో ఉంచుకుని సత్తుపల్లి-బీహెచ్‌ఈఎల్ మార్గంలో ఏసీ రాజధాని బస్సులను కూడా ఏర్పాటు చేసినట్లు తెలిపారు. సత్తుపల్లి నుండి బీహెచ్‌ఈఎల్‌కు ఉదయం 7:45, 9:15, 10:00 గంటలకు, రాత్రి 9:00, 9:45, 10:30 గంటలకు బస్సులు నడుస్తాయని చెప్పారు. అదేవిధంగా బీహెచ్‌ఈఎల్ నుండి సత్తుపల్లికి ఉదయం 8:00, 9:00, 10:00 గంటలకు, రాత్రి 9:00, 10:00, 11:00 గంటలకు ఏసీ బస్సు సేవలు అందుబాటులో ఉంటాయని తెలిపారు. ప్రయాణికులు ఈ సేవలను సద్వినియోగం చేసుకోవాలని డిపో మేనేజర్ కోరారు.




## పీచర గ్రామ పంచాయతీ సిబ్బందికి యూనిఫాంల పంపిణీ

**వేలేరు, మే 18 (తెలంగాణ ముచ్చట్లు):** వేలేరు మండలం పీచర గ్రామ పంచాయతీ సిబ్బందికి సోమవారం రోజున యూనిఫాంలను గ్రామ సర్పంచ్ మరిజే అనిత నరసింహారావు అందజేశారు. గ్రామంలో పరిశుభ్రత, అభివృద్ధి కార్యక్రమాల్లో సిబ్బంది కీలక పాత్ర పోషిస్తున్నారని ఆమె తెలిపారు. సిబ్బంది క్రమశిక్షణతో విధులు నిర్వహించి పీచర గ్రామానికి మంచి పేరు తీసుకురావాలని సూచించారు. ఈ కార్యక్రమంలో గ్రామ కార్యదర్శి తోట అనిల్, ఉప సర్పంచ్ గుడికందుల ప్రశాంత్, వార్డు సభ్యులు కొలిపాక వెంకటేష్, జగన్, ఉప్పల శ్రీధర్ రెడ్డి, పురామణి కవిత, గుడికందుల రాకేష్, రామంచ ప్రశాంత్ మరియు గ్రామపంచాయతీ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.



## బొమ్మ శ్రీరామ్ చక్రవర్తికి ఘన సన్మానం

- కాంగ్రెస్ పార్టీ బలోపేతానికి కృషి చేయాలి : ఇంగిలే రామారావు

**ఇల్లంతకుంట, మే 18 (తెలంగాణ ముచ్చట్లు):** తెలంగాణ రాష్ట్ర మున్నూరు కాపు కార్పొరేషన్ చైర్మన్‌గా నియమితులై తొలి సారి కరీంనగర్‌కు విచ్చేసిన బొమ్మ శ్రీరామ్ చక్రవర్తిని కాంగ్రెస్ పార్టీ ఆత్మీయ సన్మాన కార్యక్రమంలో ఘనంగా సత్కరించారు. కరీంనగర్ ఇందిరా భవన్‌లో నిర్వహించిన ఈ కార్యక్రమంలో శ్రీ సీతారామ చంద్రస్వామి దేవస్థాన చైర్మన్ ఇంగిలే రామారావు శాలువాతో సన్మానించి శుభాకాంక్షలు తెలిపారు.

ఈ సందర్భంగా ఇంగిలే రామారావు మాట్లాడుతూ, బొమ్మ శ్రీరామ్ చక్రవర్తి మరెన్నో ఉన్నత పదవులు అధిరోహించాలని ఆకాంక్షించారు. మున్నూరు కాపు కుల ఐక్యత, అభివృద్ధి కోసం నిరంతరం కృషి చేస్తూ, రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీ చేపడుతున్న ప్రజా పాలన కార్యక్రమాల్లో చురుకుగా పాల్గొని పార్టీ బలోపేతానికి సేవలు అందించాలని కోరారు.

ఈ కార్యక్రమంలో కరీంనగర్ జిల్లా సెక్రటరీ మేకమల్ల అశోక్, కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు పూదరి శివకుమార్ గౌడ్, యూత్ కాంగ్రెస్ నాయకులు ఉమ్మడి సందీప్ తదితరులు పాల్గొన్నారు.

## వేలేరు మండల కేంద్రంలో 5 కే రన్, 2కే వాక్‌థాన్ ఘనంగా నిర్వహణ

**వేలేరు, మే 18 (తెలంగాణ ముచ్చట్లు):** వేలేరు మండల కేంద్రంలో 99 రోజుల ప్రజా పాలన ప్రగతి ప్రణాళికలో భాగంగా స్పోర్ట్స్ అండ్ యూత్ శాఖ ఆధ్వర్యంలో 5కే రన్ మరథాన్, 2కే వాక్‌థాన్‌ను ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా బిల్లా యాదగిరి (వేలేరు మండల సర్పంచుల ఫోరం అధ్యక్షులు, సర్పంచ్ - వేలేరు మేజర్ (గ్రామపంచాయతీ), ఎంఈఓ చంద్ర మొగిళి , ఎంపీఓ అఫ్జల్, ఏపీఓ విజయ, ఏఈ హౌసింగ్ అభిలాష్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా సర్పంచ్ మాట్లాడుతూ, తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన ప్రజా పాలన ప్రగతి ప్రణాళికలో భాగంగా వివిధ శాఖలకు సంబంధించిన వారోత్సవాలు నిర్వహిస్తున్నామని తెలిపారు. అందులో భాగంగా క్రీడల శాఖ ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ 5కే రన్ మరియు వాక్‌థాన్ కార్యక్రమం ప్రజల్లో ఆరోగ్య చైతన్యాన్ని పెంపొందించడమే లక్ష్యమని చెప్పారు.




నిత్యం వాకింగ్ చేయడం ద్వారా ఆరోగ్యంగా ఉండవచ్చని, పౌష్టికాహారం తీసుకోవడం కూడా అత్యంత అవసరమని సూచించారు. అలాగే మండల స్థాయిలో ఈ వారోత్సవాల్లో భాగంగా క్రీడా పోటీలు కూడా నిర్వహిస్తున్నామని పేర్కొన్నారు.

అనంతరం కార్యక్రమంలో పాల్గొన్న వారికి సర్పంచ్ మరియు అధికారులు పండ్లను పంపిణీ చేశారు.

ఈ కార్యక్రమంలో ఉప సర్పంచ్ శ్రీకర్, జీపీ కార్యదర్శి సంపత్ కుమార్, ఎంపీడీవో కార్యాలయ సిబ్బంది రవి ప్రసాద్, రాజేశ్వర్, ప్రదీప్, కరుణాకర్, వార్డు సభ్యులు, యువజన సంఘ నాయకులు, సభ్యులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

## కార్మిక సమస్యల పరిష్కారంలో గుర్తింపు సంఘం విఫలం

- రాబోయే రోజుల్లో ఐ ఎన్ టి యూ సి విజయం ఖాయం



మంచిర్యాల మే18( తెలంగాణ ముచ్చట్లు)* సింగరేణి కార్మికుల సమస్యలు పరిష్కరించడంలో ఏఐటీయూసీ గుర్తింపు సంఘం పూర్తిగా విఫలమైందని ఐ ఎన్ టి యూ సి నాయకులు ఆరోపించారు, సోమవారం స్థానిక మందమర్రి ప్రెస్ క్లబ్ లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో నాయకులు దేవి భూమయ్య, సమ్మయ్య, నరేందర్ లు మాట్లాడుతూ రెండున్నర సంవత్సరాల నుండి కార్మికులకు ఇచ్చిన హామీలను నెరవేర్చలేదని పేర్కొన్నారు, దశాబ్దం పాటు అధికారంలో ఉన్న టిఆర్ఎస్ పార్టీ కార్మిక అనుబంధ సంస్థ టీబీజీకేఎస్ కూడా కార్మిక వర్గానికి చేసిందేమీ లేదని ధ్వజమెత్తారు, అనేక కార్మిక సమస్యలపై పోరాడి విజయం సాధించిన ఐ ఎన్ టి యూ సి సంఘాన్ని విమర్శించడం సరైనది కాదని అన్నారు,

కార్మికుల సమస్యలు కేవలం తెలంగాణ కనీస వేతనాల బోర్డ్ చైర్మన్, సెక్రటరీ జనరల్ జనక్ ప్రసాద్ నాయకత్వంలోనే పరిష్కారం అవుతాయని ధీమా వ్యక్తం చేశారు, డిపెండెంట్ ఉద్యోగాల విషయంలో ఐఎన్టీయూసీ నిరంతరం చిత్తశుద్ధితో కృషి చేస్తోందని సంబంధిత అధికారులను, మంత్రులను ఎప్పటికప్పుడు కలిసి కార్మికుల సమస్యలను తెలియజేస్తున్నామని గుర్తు చేశారు, ఈ కార్యక్రమంలో వెంకటస్వామి, శ్రీనివాస్, ఒదెలు, చంద్రశేఖర్, భిక్షపతి తదితర నాయకులు పాల్గొన్నారు.

## జమ్మికుంట స్పోర్ట్స్ క్లబ్ నూతన కమిటీ ఎంపిక

- అధ్యక్షుడిగా వోజ్జ రాజు – ప్రధాన కార్యదర్శిగా గండికోట సమ్మయ్య



**జమ్మికుంట టౌన్ మే 18 (తెలంగాణ ముచ్చట్లు):** గత నాలుగు దశాబ్దాలుగా అథ్లెటిక్స్ రంగంలో జమ్మికుంటకు ప్రత్యేక గుర్తింపు తీసుకువచ్చిన జమ్మికుంట స్పోర్ట్స్ క్లబ్ నూతన కార్యవర్గాన్ని సోమవారం ప్రభుత్వ డిగ్రీ కళాశాల మైదానంలో నిర్వహించిన సమావేశంలో ఏకగ్రీవంగా ఎంపిక చేశారు. ఈ సందర్భంగా సభ్యులు మాట్లాడుతూ, జమ్మికుంట స్పోర్ట్స్ క్లబ్ ఆధ్వర్యంలో రాష్ట్ర, జాతీయ, అంతర్జాతీయ స్థాయి పోటీలలో పాల్గొన్న క్రీడాకారులు అనేక పతకాలు సాధించి జమ్మికుంటతో పాటు కరీంనగర్ జిల్లా, నాటి ఆంధ్రప్రదేశ్, నేటి తెలంగాణ రాష్ట్రానికి గుర్తింపు తీసుకువచ్చారని కొనియాడారు.

నూతన కమిటీలో గౌరవ అధ్యక్షులుగా రామ్ రాజబాబు, మార్కండేయ, దొడ్డ కుమారస్వామిలను ఎంపిక చేశారు. సలహాదారులుగా ఆర్‌పీఎఫ్ రమేష్, హెడ్ కానిస్టేబుల్ సంపత్, రిటైర్డ్ ఫిజికల్ డైరెక్టర్ మారపల్లి మొగులయ్యలను నియమించారు.

అధ్యక్షుడిగా అంతర్జాతీయ క్రీడాకారుడు వోజ్జ రాజును ఎన్నుకోగా, ఉపాధ్యక్షులుగా రామ్ శ్రీనివాస్, ఎగిత అశోక్, డాక్టర్ అంబాల ప్రభాకర్ (ప్రభు), వంతడుపుల రఘులను ఎంపిక చేశారు. ప్రధాన కార్యదర్శిగా గండికోట సమ్మయ్య, సహాయ కార్యదర్శులుగా బుర్ర కుమార్, కొలుగూరి సురేష్ బాధ్యతలు స్వీకరించారు. కోశాధికారిగా తిరుపతి శ్రీనివాస్, కార్యవర్గ సభ్యులుగా మాచర్ల రాజు, సమ్మయ్య (బ్యాంక్)లను ఎన్నుకున్నారు.

గ్రౌండ్ కోచ్‌లుగా కొలుగూరి నరేష్, కొయ్యడ సాయికృష్ణలను ఎంపిక చేశారు.

ఈ సందర్భంగా నూతనంగా ఎన్నికైన అధ్యక్షుడు వోజ్జ రాజుతో పాటు ఇటీవల జమ్మికుంట మున్సిపాలిటీ ఎన్నికల్లో విజయం సాధించిన ఎగిత అశోక్, కొలుగూరి సురేష్, మాచర్ల రాజు, అలాగే గ్రౌండ్ కోచ్‌లు కొలుగూరి నరేష్, కొయ్యడ సాయికృష్ణలను క్రీడాకారులు ఘనంగా సన్మానించి శుభాకాంక్షలు తెలిపారు.





## కొత్తపల్లిలో పింఛన్ లబ్ధిదారుల ఆధార్ వెరిఫికేషన్

- అర్హులకే పింఛన్లు అందేలా ప్రత్యేక శిబిరం నిర్వహణ

**జమ్మికుంట టౌన్ మే 18 (తెలంగాణ ముచ్చట్లు):** జమ్మికుంట మున్సిపాలిటీ పరిధిలోని కొత్తపల్లి 18వ వార్డులో పింఛన్ లబ్ధిదారుల కోసం ప్రత్యేక ఆధార్ వెరిఫికేషన్ శిబిరం నిర్వహించారు. ప్రభుత్వం ఆదేశాల మేరకు ఇప్పటికే పింఛన్లు పొందుతున్న లబ్ధిదారుల వివరాలను ధృవీకరించేందుకు ఈ కార్యక్రమాన్ని చేపట్టారు.

కొత్తపల్లి హనుమాన్ దేవాలయం సమీపంలో ఏర్పాటు చేసిన ఈ శిబిరంలో లబ్ధిదారుల ఆధార్ వివరాలు, పింఛన్ సంబంధిత సమాచారం పరిశీలించి నమోదు చేశారు. పింఛన్లు సక్రమంగా అర్హులకే అందేలా పారదర్శక విధానంలో వెరిఫికేషన్ నిర్వహిస్తున్నట్లు అధికారులు తెలిపారు.

ఈ సందర్భంగా వార్డు కౌన్సిలర్ కుతాటి తిరుపతి, వార్డు ఆఫీసర్ రామారావు, మున్సిపాలిటీ సిబ్బంది శ్రీకాంత్‌తో పాటు వార్డు సభ్యులు పాల్గొని లబ్ధిదారులకు అవసరమైన సహాయం అందించారు.

అధికారులు మాట్లాడుతూ, ప్రతి లబ్ధిదారుడు తన ఆధార్ వివరాలను సరిచూసుకుని సమర్పించాలని సూచించారు. ఈ వెరిఫికేషన్ ప్రక్రియతో పింఛన్ వ్యవస్థలో పారదర్శకత పెరిగి, అర్హులైన వారికి సేవలు మరింత సమర్థంగా అందుతాయని తెలిపారు.

తెలంగాణ TELANGANA MUCHATLU ముచ్చట్లు
ఎడిటర్ : బొల్లెపాక రాజేష్ తెలుగు దిన పత్రిక

## మత విద్వేషాల ఆరోపణలతో మీడియా,సోషల్ మీడియా ఖాతాలకు నోటీసులు

హైదరాబాద్,మే18(తెలంగాణ ముచ్చట్లు): తెలంగాణ పోలీసుల నోటీసుల వ్యవహారం వివాదాస్పదంగా మారింది. మత పరమైన ఉద్రిక్తతలకు సంబంధించిన పోస్టులు, వార్తలు ప్రజల్లో విద్వేషాలను రెచ్చగొట్టేలా ఉన్నాయని పేర్కొంటూ హైదరాబాద్ సిటీ పోలీసుల ఐటీ సెల్ ఎక్స్ (X) సంస్థకు అధికారిక నోటీసులు పంపింది.

ఐటీ చట్టంలోని సెక్షన్ 69(A), 79(3) తో పాటు బీఎన్ఎస్ఎస్ చట్టాల కింద జారీ చేసిన ఈ నోటీసుల్లో, కొన్ని పోస్టులు "ప్రజా అశాంతి, మత విద్వేషాలు, సామాజిక విభేదాలు" సృష్టించే అవకాశముందని పేర్కొన్నారు. మెహిదీపట్నం ఘటనకు సంబంధించిన పోస్టులు, వార్తలు, వీడియోలు పంచుకున్న పలువురు జర్నలిస్టులు, మీడియా సంస్థలు, సామాజిక మాధ్యమ ఖాతాలను సమీక్ష కోసం గుర్తించారు.

ఇందులో పలు మీడియా సంస్థలు, జర్నలిస్టుల ఖాతాలు కూడా ఉండటంతో ఈ అంశం మరింత చర్చనీయాంశమైంది. మీడియా స్వేచ్ఛపై ఇది దాడి అని, ప్రభుత్వాన్ని ప్రశ్నించే గొంతులను అణచివేయడానికి ప్రయత్నిస్తున్నారని జర్నలిస్టు సంఘాలు ఆరోపిస్తున్నాయి. మరోవైపు, శాంతిభద్రతల పరిరక్షణ కోసమే చట్టపరమైన చర్యలు తీసుకుంటున్నామని పోలీసు వర్గాలు చెబుతున్నాయి.








## బండి సంజయ్ రాజీనామా చేయాలంటూ హుజురాబాద్‌లో టీఆర్ఎస్ నాయకుల ఆందోళన

హుజురాబాద్ టౌన్ , మే 18(తెలంగాణ ముచ్చట్లు ): హుజురాబాద్ పట్టణంలోని అంబేద్కర్ చౌరస్తా సోమవారం రాజకీయ ఉద్రిక్తతలకు వేదికైంది. టీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు భారీ సంఖ్యలో చేరుకుని కేంద్ర సహాయ మంత్రి బండి సంజయ్ కుమార్ పై తీవ్ర విమర్శలు చేస్తూ రాస్తారోకో నిర్వహించారు. బండి సంజయ్ కుమారుడిపై అత్యాచార ఆరోపణలు వెలుగులోకి వచ్చిన నేపథ్యంలో దీనిపైన నైతిక బాధ్యత వహిస్తూ మంత్రి పదవికి వెంటనే రాజీనామా చేయాలని డిమాండ్ చేశారు.

అంబేద్కర్ చౌరస్తాలో చేరుకున్న నాయకులు కేంద్ర ప్రభుత్వానికి, బీజేపీ నాయకత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేస్తూ నిరసన వ్యక్తం చేశారు. "మహిళల భద్రతపై మాట్లాడే బీజేపీ నాయకులు ఇప్పుడు సమాధానం చెప్పాలి", "బండి సంజయ్ రాజీనామా చేయాలి" అంటూ కార్యకర్తలు నినాదాలతో హోరెత్తించారు. నిరసనకారులు రహదారిపై బైఠాయించి రాస్తారోకో నిర్వహించడంతో ప్రధాన రహదారిపై కొంతసేపు ట్రాఫిక్‌కు అంతరాయం ఏర్పడింది. వాహనదారులు ఇబ్బందులు ఎదుర్కొన్నారు.

సమాచారం అందుకున్న పోలీసులు వెంటనే ఘటనాస్థలికి చేరుకుని పరిస్థితిని అదుపులోకి తీసుకునే ప్రయత్నం చేశారు. సీఐ ఆధ్వర్యంలో భారీ పోలీసు బందోబస్తు ఏర్పాటు చేసి నిరసనకారులను రహదారి నుంచి తొలగించారు. ఆందోళన మరింత ఉద్రిక్తంగా మారకుండా పోలీసులు టీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలను అదుపులోకి తీసుకుని పోలీస్ స్టేషన్‌కు తరలించారు. అనంతరం వారిని విడుదల చేసినట్లు తెలిసింది. ఈ సందర్భంగా టీఆర్ఎస్ నాయకులు మాట్లాడుతూ మహిళలపై జరిగే దాడుల విషయంలో బీజేపీ ద్వంద్వ వైఖరి అవలంబిస్తోందని ఆరోపించారు. ఆరోపణలు ఎదుర్కొంటున్న వారి విషయంలో కేంద్ర ప్రభుత్వం స్పష్టమైన వైఖరి వెల్లడించాలని డిమాండ్ చేశారు. ప్రజాస్వామ్య పద్ధతిలో తమ నిరసన కొనసాగుతుందని పేర్కొన్నారు. ఈ ఆందోళనలో స్థానిక టీఆర్ఎస్ నాయకులు, యువజన నాయకులు, మహిళా కార్యకర్తలు మరియు పెద్ద సంఖ్యలో పార్టీ శ్రేణులు పాల్గొన్నారు. హుజురాబాద్‌లో జరిగిన ఈ రాస్తారోకో రాజకీయంగా చర్చనీయాంశమైంది.

# లీడర్ల లగ్జరీ లైఫ్.. జనం బతుకులు రోడ్డు పాలు.. ఎన్నాళ్లీ దౌర్భాగ్యం?




> "కళ్ళముందే ఘోరాలు జరుగుతున్నా, అక్రమాలు రాజ్యమేలుతున్నా జనం చూసీచూడనట్లు పక్కకు తప్పుకుంటున్నారు. 'మనకెందుకులే, మన ఇల్లు ప్రశాంతంగా ఉంటే చాలు' అనే స్వార్థపూరితమైన ఆలోచన మనిషిని పిరికివాడిగా మార్చేసింది. సమాజంలో ఆలుముకున్న ఈ భయంకరమైన సామాజిక నిస్తేజం, నిశ్శబ్దం ఏ ప్రకృతి విపత్తు కంటే కూడా అత్యంత ప్రమాదకరమైనది.ఒక సమాజం తన ప్రశ్నించే ఆత్మను కోల్పోతే, అది బాహ్యంగా బతికి ఉన్నా శవాల దిబ్బతో సమానమే అవుతుంది. నిజాన్ని నిర్భయంగా మాట్లాడేవాడిని ఈ కుళ్ళిపోయిన వ్యవస్థ వేధిస్తుండవచ్చు. కానీ, సమాజం వహిస్తున్న ఈ నేరపూరితమైన మౌనమే అవినీతిపరులకు, అధర్మానికి మరింత అనుకూలమైన రక్షణ కల్పిస్తోంది. మార్పు కోసం ఎవరో వస్తారని ఎదురుచూడడం మూర్ఖత్వం. ఆ మార్పు మన ఓటు నుండి, మన గొంతు నుండి మాత్రమే ప్రారంభం కావాలి."

హైదరాబాద్,మే18(తెలంగాణ ముచ్చట్లు): భారతమాతకు జయహో అంటూ గొంతెత్తి నినదించడం చాలా సులభం. నడివీధిలో మూడు రంగుల జాతీయ జెండాను చూసినప్పుడు ప్రతి పౌరుడి గుండె ఉప్పొంగడం కూడా అంతే సహజం. కానీ, రంగుల హంగుల వెనుక దాగి ఉన్న ఒక చేదైన, నిజమైన ప్రశ్న ఇప్పుడు మనస్సాక్షి ఉన్న ప్రతి ఒక్కరి ముందు నిలబడి ఉంది. అదేమిటంటే ఆకలితో నకనకలాడుతూ, ఎండిపోయిన కడుపుకు ఈ దేశభక్తి అనే అమూర్త భావన ఏమాత్రం అర్థమవుతుంది? పొట్టకు పిడికెడు అన్నం లేనప్పుడు, చేతికి కాసింత పని దొరకనప్పుడు, కళ్ళ ముందు భవిష్యత్తు చీకటిమయంగా కనిపిస్తున్నప్పుడు వందేమాతరం అనే అమృత గీతంలోని సంగీతం ఆ పేదవాడి ఆత్మకు చేరుతుందా? ఇది కేవలం ఒక వ్యక్తికి సంబంధించిన సమస్య కాదు. ఇది సమకాలీన సమాజపు నిస్సహాయ స్థితిని, మన సామాజిక మనస్సాక్షిని నిలదీస్తున్న పదునైన ప్రశ్న.నేడు మన భారతదేశంలో స్పష్టంగా రెండు రకాల ప్రపంచాలు సమాంతరంగా జీవిస్తున్నాయి. ఒక వర్గం వందల కోట్ల అక్రమ ఆస్తులతో, ఖరీదైన విలాసవంతమైన భవనాలతో, అధునాతన కార్ల శ్రేణితో లగ్జరీ జీవితాన్ని అనుభవిస్తూ హాయిగా విహరిస్తోంది. మరో వర్గం రెక్కాడితే గానీ డొక్కాడనట్టు, రోజువారీ కూలి కోసం నిప్పులు చెరిగే ఎండలో తపించిపోయే శ్రామికులు, రక్తాన్ని చెమటగా మార్చి పంట పండించినా కనీస గిట్టుబాటు ధర రాక అప్పుల ఊబిలో కూరుకుపోయే అన్నదాతలు, ఎన్నో ఏళ్ళు కష్టపడి చదువు పూర్తి చేసినా సరైన ఉద్యోగం దొరకక నిరాశానిస్పృహల్లో మగ్గిపోతున్న నిరుద్యోగ యువతీయువకులు. ఈ రెండు భిన్న వర్గాల మధ్య రోజురోజుకూ పెరుగుతున్న ఆర్థిక, సామాజిక అగాధమే ఈనాడు మన దేశాన్ని పట్టి పీడిస్తున్న అతిపెద్ద అంతర్గత సంక్షోభం.

ఒకప్పుడు రాజకీయాలు అంటే నిస్వార్థమైన ప్రజాసేవ. ఒక నాయకుడు అంటే సమాజం కోసం త్యాగానికి, నిబద్ధతకు పర్యాయపదం. కానీ నేటి ఆధునిక కాలంలో కథ పూర్తిగా మారిపోయింది. రాజకీయ రంగం ఇప్పుడు అత్యంత లాభదాయకమైన ఒక కార్పొరేట్ వ్యాపార క్షేత్రంగా రూపాంతరం చెందింది. అంగబలం, అర్థబలం ఉన్న ధనవంతులు ఎన్నికలలో వందల కోట్లు పెట్టుబడిగా పెట్టి గెలుస్తున్నారు. ఆ తర్వాత అధికార పీఠం ఎక్కగానే, తాము పెట్టిన పెట్టుబడికి రెట్టింపు, మూడింతలు, నూరింతలుగా సామాన్యుల రక్తాన్ని పిండి వసూలు చేసుకుంటున్నారు. దారుణం ఏమిటంటే, పార్టీ అభ్యర్థిత్వం పొందే ముందే తమ అక్రమ సంపాదనల లెక్కలు, లాభాల శాతాలను ముందే సిద్ధం చేసుకుంటున్నారు. పదవిలోకి వచ్చిన ఒకటి రెండు సంవత్సరాలలోనే వందల కోట్ల సంపద ఏ ఏ మూలల నుండి, ఏ ఏ అక్రమ మార్గాల ద్వారా వస్తోందో సామాన్య జనానికి స్పష్టంగా తెలుసు. కానీ తెలిసినా అడిగే ధైర్యం లేని నోళ్ళు, ఒకవేళ ఎవరైనా ప్రశ్నించినా పట్టించుకోని నిర్వీర్యమైన వ్యవస్థలు నేడు రాజ్యమేలుతున్నాయి.కష్టపడి పనిచేసే సామాన్యుడి ప్రజాధనం ప్రజలకు చేరకుండా, మధ్యలో ఉన్న దళారీల, రాజకీయ నాయకుల జేబులు నింపుతోంది. ప్రభుత్వ కాంట్రాక్టులలో భారీ కమిషన్లు, అనుమతుల కోసం టేబుల్ కింద ఇచ్చే లంచాలు, ఉద్యోగ నియామకాలలో జరిగే నగదు లావాదేవీలు ఇవి నేడు ఏ రాష్ట్రానికైనా వర్తించే నగ్న సత్యాలు. ఈ అన్యాయపు అవినీతి వలయంలో అమాయకుడైన పౌరుడు నలిగిపోతున్నాడు. నిజాయితీగా ప్రతి వస్తువుపై పన్నులు కడుతున్న పౌరుడికి కనీసం నడవడానికి ఒక మంచి రహదారి దొరకడం లేదు. ప్రభుత్వ ఆస్పత్రికి వెళ్తే ప్రాణాలు నిలిపే సరైన వైద్యం అందడం లేదు. ప్రభుత్వ పాఠశాలల్లో పిల్లలకు నాణ్యమైన విద్య దొరకడం లేదు. ఇంతకంటే సామాన్యుడికి జరిగే అన్యాయం మరొకటి ఉంటుందా? దేశాన్ని లోపలి నుండి గుల్ల చేస్తున్న ఈ దోపిడీ దేశద్రోహం కాదా?ఎన్నికల పండుగ వచ్చిందంటే చాలు, రాజకీయ పార్టీల ప్రచార రథాలు ఊరూరా సంచులతో నోట్లు కుమ్మరిస్తూ తిరుగుతాయి. కలర్ టీవీలు, మిక్సీలు, గ్రైండర్లు, సైకిళ్ళు, స్కూటర్లు వంటి ఉచితాల వాగ్దానాల జాబితాలు వెల్లువలా వచ్చిపడుతుంటాయి. ఉచిత విద్యుత్, ఉచిత నీళ్ళు, ఉచిత బస్సు ప్రయాణాలు ప్రభుత్వాలు అభివృద్ధిని పక్కనబెట్టి, ఈ ఉచితాలనే ఒక బ్రహ్మాస్త్రంగా చేసుకుని ఓటర్లను బహిరంగంగానే కొనుగోలు చేస్తున్నాయి. ఈ కుళ్ళిపోయిన ప్రక్రియలో సమాజానికి అత్యంత ప్రమాదకరమైన నష్టం జరుగుతోంది. ప్రజలు తమ ఐదేళ్ల భవిష్యత్తును నిర్ణయించే అత్యంత పవిత్రమైన ఓటు హక్కును, తాత్కాలికమైన ప్రలోభాలకు, వెయ్యి రెండు వేల నోట్లకు గుడ్డిగా అమ్ముకుంటున్నారు.ఒక పౌరుడు ఎన్నికల వేళ తన ఓటును అమ్ముకున్నాడంటే, అతను ఐదు సంవత్సరాల పాటు తన ఆత్మగౌరవాన్ని, హక్కులను పాలకులకు తాకట్టు పెట్టినట్లే.అందుకే అవినీతి పాలకులు పబ్లిక్‌గా అక్రమాలు చేయడానికి అస్సలు భయపడడం లేదు. ఎందుకంటే వారికి బాగా తెలుసు ఈ ఓటరు వచ్చే ఎన్నికల్లో కూడా తాము ఇచ్చే వెయ్యి రూపాయల నోటుకో, మద్యం సీసాకో లొంగిపోయి మళ్ళీ తమకే ఓటు వేస్తాడని. ఈ వికృత రాజకీయ చక్రం నిరంతరాయంగా తిరుగుతూనే ఉంది. ప్రతి ఒక్కరూ ఒక ప్రాథమిక సత్యాన్ని గుర్తుంచుకోవాలి ప్రభుత్వాలు ఉచితంగా ఇచ్చే ప్రతి పైసా ఆకాశం నుండి ఊడిపడదు. అది పన్నుల రూపంలో ప్రజల నుండి వసూలు చేసిన ప్రజాధనం నుండో, లేదా దేశ ప్రగతికి వాడాల్సిన అభివృద్ధి నిధుల నుండో, లేదంటే భావి తరాల నెత్తిన మోపే అప్పుల నుండో వస్తుంది.ఒకప్పుడు మన సమాజం చైతన్యంతో మేల్కొనేది. ఎక్కడైనా చిన్న అన్యాయం జరిగినా, హక్కుల కోసం ప్రజలు వీధుల్లోకి వచ్చి నిప్పులు చెరిగే విప్లవాలు చేసేవారు. కానీ నేడు? కళ్ళముందే ఘోరాలు జరుగుతున్నా, అక్రమాలు రాజ్యమేలుతున్నా జనం చూసీచూడనట్లు పక్కకు తప్పుకుంటున్నారు. మనకెందుకులే, మన ఇల్లు ప్రశాంతంగా ఉంటే చాలు అనే స్వార్థపూరితమైన ఆలోచన మనిషిని పిరికివాడిగా మార్చేసింది. సమాజంలో ఒక భయంకరమైన సామాజిక నిస్తేజం, నిశ్శబ్దం అలుముకున్నాయి. ఈ నిస్తేజం ఏ ప్రకృతి విపత్తు కంటే కూడా అత్యంత ప్రమాదకరమైనది. ఒక సమాజం తన ప్రశ్నించే ఆత్మను కోల్పోతే, అది బాహ్యంగా బతికి ఉన్నా శవాల దిబ్బతో సమానమే అవుతుంది.ప్రస్తుత రోజుల్లో అన్యాయాలు అంతకంతకూ అధికమవుతున్నాయి. అక్రమ సంపాదనలు సర్వసాధారణమైపోయాయి. అధర్మమే అధికార పీఠంపై కూర్చుని శాసిస్తోంది. అయినా సరే, నోరు తెరవడానికి పౌరులకు భయం వేస్తోంది. ఎందుకంటే నిజాన్ని నిర్భయంగా మాట్లాడేవాడిని, ప్రశ్నించేవాడిని ఈ కుళ్ళిపోయిన వ్యవస్థ రకరకాలుగా వేధిస్తోంది. ఈ భయానక వాతావరణం వల్ల మంచి మనసున్న, మేధావులైన మనుషులు సైతం మౌనంగా ఉండిపోతున్నారు. సమాజం వహిస్తున్న ఈ నేరపూరితమైన మౌనమే అవినీతిపరులకు, అధర్మానికి మరింత అనుకూలమైన వాతావరణాన్ని, రక్షణను కల్పిస్తోంది.దేశానికి వెన్నెముక, బంగారు భవిష్యత్తు అయిన నేటి యువశక్తి మొబైల్ ఫోన్ స్క్రీన్లకు బందీ అయిపోయింది. ఇన్స్టాగ్రామ్ రీల్స్, యూట్యూబ్ షార్ట్స్ చూడడంలో విలువైన గంటలు క్షణాల్లో కరిగిపోతున్నాయి.ఎటువంటి అర్థం, పరమార్థం లేని అసభ్యకరమైన, పనికిరాని కంటెంట్ కోసం యువత కళ్ళు అరిగేలా కాలం గడుపుతోంది. ఈ డిజిటల్ వ్యసనం ఒక మత్తుమందులా మారి యువత మేధస్సును మొద్దుబారుస్తోంది. స్వతంత్రంగా ఆలోచించే తార్కిక శక్తిని పూర్తిగా క్షీణింపజేస్తోంది. చుట్టూ ఉన్న సామాజిక సమస్యలపై కనీసం స్పందించే సున్నితత్వం కూడా వారిలో లోపిస్తోంది.ప్రపంచంలోనే అత్యధిక యువజన శక్తి కలిగిన దేశం భారతదేశం అని మనం గర్వంగా చెప్పుకుంటాం. కానీ ఆ అపారమైన మానవ శక్తి నేడు ఎలా వినియోగమవుతోంది? సృజనాత్మకతలోనో, శాస్త్రీయ పరిశోధనలలోనో, నూతన ఆవిష్కరణలలోనో కాదు కేవలం బాహ్యంగా రంగులమయంగా కనిపించే సోషల్ మీడియా మాయా ప్రపంచంలో లైకులు, కామెంట్ల కోసం. అవినీతి రాజకీయ నాయకులకు కూడా సరిగ్గా ఇదే కావాలి. ఎందుకంటే, ఆలోచించని యువత ఎప్పటికీ ప్రశ్నించదు. ప్రశ్నించని యువత తమ దోపిడీ వ్యవస్థను ఎన్నటికీ సవాలు చేయదు. ఈ విధంగా నిద్రపోతున్న నేటి యువతరం ప్రస్తుత పాలకులకు లభించిన వరం, కానీ దేశ భవిష్యత్తుకు తీరని శాపం.

ఒకవైపు హైదరాబాద్, బెంగళూరు వంటి మెట్రో నగరాలలో ఆకాశాన్ని తాకేలా వెలసిన సూపర్ లగ్జరీ గేటెడ్ కమ్యూనిటీ అపార్ట్‌మెంట్లు, ఐటీ టవర్లు ఇంకొకవైపు తెలుగు రాష్ట్రాల పల్లెటూళ్ళలో కనీసం తాగడానికి గుక్కెడు మంచి నీరు కూడా దొరకక మైళ్ళ దూరం నడిచే పేద గ్రామాలు. ఒకవైపు ప్రైవేటు జెట్ విమానాలలో తిరుగుతూ కార్పొరేట్ సామ్రాజ్యాలను ఏలే లక్ష్మీపుత్రులు, మరోవైపు కనీసం బస్సు టికెట్ కొనుక్కోవడానికి డబ్బుల్లేక కాలినడకన వలసవెళ్లే కూలీలు. ఈ ఆర్థిక అసమానత సహజంగా వచ్చింది కాదు ఇది అధికార వర్గాలు తమ స్వార్థం కోసం కావాలని నిర్మించుకున్న ఒక వ్యవస్థీకృత దోపిడీ విధానం. పాలకులైన వారు తమ ఆస్తులను పెంచుకోవడానికి వీలుగా చట్టాలను తమకు అనుకూలంగా మార్చుకుంటున్నారు. ఫలితంగా పేదవాడు మరింత పేదరికంలోకి కూరుకుపోతుంటే, ధనవంతుడు కొండలా సంపదను పెంచుకుంటున్నాడు.ఈ తీవ్రమైన వ్యత్యాసాల నేపథ్యంలోనే అసలైన ప్రశ్న తలెత్తుతుంది ఈ వివక్ష పూరిత అసమాన సమాజంలో పేదవాడు ఏ దేశం కోసం, ఎవరి రక్షణ కోసం సరిహద్దుల్లో ప్రాణాలర్పించాలి? తన పిల్లలకు కనీసం మంచి చదువు, కడుపునిండా తిండి ఇవ్వలేని నిస్సహాయ తండ్రి, స్వాతంత్ర్య దినోత్సవం నాడు జాతీయ గీతం పాడుతూ కన్నీరు కార్చినా, ఆకలి కడుపుతో చేసే ఆ వందనం నిజమైన దేశభక్తి ఎలా అవుతుంది? కేవలం ముఖానికి దేశభక్తి రంగులు పులుముకున్నంత మాత్రాన మార్పు వస్తుందా?ఈ వ్యవస్థాగత సమస్యలన్నింటికీ పరిష్కారం ఆకాశం నుండి ఊడిపడే ఎవరో ఒక మహానాయకుడో, అవతార పురుషుడో తెస్తాడని చేతులు కట్టుకుని ఎదురుచూడడం ముమ్మాటికీ మూర్ఖత్వమే అవుతుంది. అసలైన పరిష్కారం మనలోనే ఉంది, మన ఆలోచనా విధానంలోనే ఉంది. ఆ మార్పు మొదట మన ఓటు నుండి ప్రారంభం కావాలి ఎటువంటి ప్రలోభాలకు, కులమతాలకు లొంగకుండా, ధర్మంగా, వివేకంతో వేసే ప్రతి ఒక్క ఓటు నుండే వ్యవస్థ ప్రక్షాళన మొదలవుతుంది. సమాజంలో జరుగుతున్న అన్యాయాలకు వ్యతిరేకంగా నిర్భయంగా గొంతు విప్పే ప్రతి ఒక్క పౌరుడి నుండి ఆ మార్పు మొదలవుతుంది. చేతిలోని మొబైల్ ఫోన్‌ను కాసేపు పక్కన పెట్టి, సమాజపు వాస్తవ సమస్యలపై దృష్టి సారించే ప్రతి యువకుడి ఆలోచన నుండి నిజమైన క్రాంతి ఉదయిస్తుంది.భారతదేశంలో ఆకలి ఉన్నచోట నిజమైన దేశభక్తి వికసించాలంటే అన్నింటికంటే ముందు ఆకలిని, పేదరికాన్ని నిర్మూలించే సమసమాజ వ్యవస్థను నిర్మించాలి. అన్యాయాన్ని ఎదిరించేలా ప్రజలు చైతన్యవంతులు కావాలి. ఈ సమాజం ఆవహించిన సుదీర్ఘ నిద్రను వదిలించుకుని మేల్కోవాలి. నిజమైన దేశభక్తి అంటే కేవలం ఆగస్టు 15 నాడో, జనవరి 26 నాడో జెండా ఊపడం, జయహో అని నినాదాలు చేయడం కాదు కుళ్ళిపోయిన ఈ రాజకీయ, సామాజిక వ్యవస్థను సరిచేయడానికి నిలబడడం, ప్రశ్నించడం.సమాజంలో మేల్కొన్న ఒకే ఒక్క పౌరుడు, స్వార్థపరులైన వందమంది రాజకీయ నాయకుల కంటే అత్యంత శక్తిమంతుడు.ఈ దేశంలో, మన చుట్టూ ఉన్న సమాజంలో నిజమైన మార్పు రావాలంటే మొదట మీరు మారాలి, నేను మారాలి, మనమందరం ఒకే తాటిపైకి వచ్చి కలిసికట్టుగా మారాలి. అప్పుడే నిజమైన దేశభక్తి మన నినాదాలలో మాత్రమే కాకుండా, దేశ పునర్నిర్మాణంలో, మన రక్తంలో సజీవంగా ప్రవహిస్తుంది.

-డా .సూర్యదేవర రామకృష్ణ ,



తెలంగాణ TELANGANA MUCHATLU
ముచ్చట్లు
ఎడిటర్ : బొల్లెపాక రాజేష్
తెలుగు దిన పత్రిక






# ధాన్యం సేకరణ వేగవంతం చేయాలి

- యుద్ధ ప్రాతిపదికన కొనుగోళ్లు పూర్తి చేయాలని ఆదేశం
- రైస్ మిల్లర్లు, లారీ యజమానులకు మంత్రి విజ్ఞప్తి
- రైతులకు ఇబ్బందులు లేకుండా చర్యలు చేపట్టాలి

**కరీంనగర్, మే 18 (తెలంగాణ ముచ్చట్లు):** వరి ధాన్యం, మొక్కజొన్న సేకరణలో రైతులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా అధికారులు ప్రత్యేక చర్యలు తీసుకోవాలని రాష్ట్ర రవాణా, బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ ఆదేశించారు. కరీంనగర్ జిల్లా కలెక్టరేట్‌లో నిర్వహించిన సమీక్ష సమావేశంలో ధాన్యం కొనుగోలు ప్రక్రియ పురోగతిపై అధికారులతో చర్చించారు. రైతులు కొనుగోలు కేంద్రాల వద్ద ఇబ్బందులు పడకుండా యుద్ధ ప్రాతిపదికన ప్రక్రియ పూర్తి చేయాలని స్పష్టం చేశారు. ఈ సమావేశంలో ఎమ్మెల్యేలు కవ్వంపల్లి సత్యనారాయణ, మేడిపల్లి సత్యం, రాష్ట్ర గ్రంథాలయ సంస్థ చైర్మన్ సత్తు మల్లేష్, జిల్లా కలెక్టర్ చిత్రా మిశ్రా, పోలీస్ కమిషనర్ గౌస్ ఆలం, ఇతర అధికారులు, రైస్ మిల్లర్ల సంఘం, లారీ యజమానుల సంఘం ప్రతినిధులు పాల్గొన్నారు. ధాన్యం కొనుగోలు ప్రక్రియలో ఎదురవుతున్న సమస్యలు, తీసుకోవాల్సిన చర్యలపై విస్తృతంగా చర్చించారు.

ఈ సందర్భంగా మంత్రి పొన్నం ప్రభాకర్ మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం రైతుల ప్రయోజనాలకు అత్యంత ప్రాధాన్యం ఇస్తోందన్నారు. ధాన్యం కొనుగోలు కేంద్రాల్లో ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా ఇప్పటికే ముఖ్యమంత్రి జిల్లా అధికారులతో వీడియో సమావేశం నిర్వహించి పలు సూచనలు చేసినట్లు తెలిపారు. ప్రభుత్వం ధాన్యం కొనుగోలు ప్రక్రియను అత్యంత ప్రాధాన్యంతో పర్యవేక్షిస్తోందని పేర్కొన్నారు. జిల్లాలో ఈ సీజన్‌కు సంబంధించి సుమారు మూడు లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం సేకరణ లక్ష్యంగా నిర్ణయించినట్లు తెలిపారు. జిల్లాలో ఏర్పాటు చేసిన మూడు వందల పద్నాలుగు కొనుగోలు కేంద్రాలకు ఇప్పటికే దాదాపు మూడు లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం వచ్చినట్లు వెల్లడించారు. ఇప్పటివరకు ఒక లక్ష యాభై ఎనిమిది వేల మెట్రిక్ టన్నుల ధాన్యం కొనుగోలు పూర్తయిందని వివరించారు.

మిగిలిన ఒకటిన్నర లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యాన్ని యుద్ధ ప్రాతిపదికన సేకరించాలని అధికారులను మంత్రి ఆదేశించారు. ఇప్పటివరకు కొనుగోలు చేసిన ధాన్యానికి సంబంధించిన అరవై మూడు శాతం చెల్లింపులు పూర్తయ్యాయని, రైతుల ఖాతాల్లో రెండు వందల ముప్పై ఏడు కోట్లకు పైగా జమ చేసినట్లు తెలిపారు. ధాన్యం కొనుగోలు ప్రక్రియలో జిల్లా యంత్రాంగానికి రైస్ మిల్లర్లు, లారీ యజమానులు సహకరించాలని మంత్రి కోరారు. లారీల కొరత తలెత్తకుండా అవసరమైన వాహనాలు అందుబాటులో ఉంచాలని సూచించారు. కొనుగోలు కేంద్రాలు, మిల్లుల వద్ద హమాలీల కొరత రాకుండా చర్యలు తీసుకోవాలని, రైతులు రోజుల తరబడి వేచి ఉండే పరిస్థితులు తలెత్తకుండా అధికారులు అప్రమత్తంగా వ్యవహరించాలని స్పష్టం చేశారు.



# ఈవీ వినియోగంపై రాంచందర్‌రావు పిలుపు

- ఎలక్ట్రిక్ వాహనంలో పార్టీ కార్యాలయానికి ప్రయాణం
- పర్యావరణ పరిరక్షణపై ప్రత్యేక సందేశం
- సుస్థిర భవిష్యత్తుకు ఈవీలే మార్గమని వ్యాఖ్య

**హైదరాబాద్, మే 18 (తెలంగాణ ముచ్చట్లు):** ఎలక్ట్రిక్ వాహనాల వినియోగాన్ని ప్రోత్సహించాల్సిన అవసరం ఉందని భారతీయ జనతా పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు ఎన్ రాంచందర్‌రావు పేర్కొన్నారు. ప్రధాని నరేంద్ర మోదీ పిలుపు మేరకు ఎలక్ట్రిక్ వాహనాల వినియోగంపై అవగాహన పెంచే లక్ష్యంతో తాను ఈవీ వాహనంలో రాష్ట్ర పార్టీ కార్యాలయానికి వెళ్లినట్లు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఇంధన పొదుపు, కాలుష్య నియంత్రణ, పర్యావరణ పరిరక్షణలో ఎలక్ట్రిక్ వాహనాలు కీలక పాత్ర పోషిస్తాయని పేర్కొన్నారు. భవిష్యత్ తరాలకు స్వచ్ఛమైన, పచ్చని వాతావరణాన్ని అందించాలంటే ప్రత్యామ్నాయ ఇంధన వనరులపై దృష్టి పెట్టాల్సిన అవసరం ఉందన్నారు. ప్రస్తుతం ప్రపంచవ్యాప్తంగా ఎలక్ట్రిక్ వాహనాల వినియోగం వేగంగా పెరుగుతోందని తెలిపారు. సంప్రదాయ ఇంధనాలపై ఆధారపడటాన్ని తగ్గించి, పర్యావరణ అనుకూల రవాణా విధానాల వైపు ప్రపంచం అడుగులు వేస్తోందని పేర్కొన్నారు.

ప్రధాని నరేంద్ర మోదీ దార్శనికతలో భాగంగా దేశంలో ఎలక్ట్రిక్ వాహనాల వినియోగాన్ని ప్రోత్సహించే చర్యలు చేపడుతున్నట్లు వివరించారు. పెట్రోల్, డీజిల్ వినియోగాన్ని తగ్గించడం ద్వారా కాలుష్య నియంత్రణతో పాటు ఇంధన వ్యయాన్ని కూడా తగ్గించవచ్చని తెలిపారు. దేశాన్ని సుస్థిర అభివృద్ధి దిశగా తీసుకెళ్లడంలో ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలని రాంచందర్‌రావు పిలుపునిచ్చారు. ఎలక్ట్రిక్ వాహనాలను దైనందిన జీవితంలో భాగం చేసుకోవడం ద్వారా పర్యావరణ పరిరక్షణకు తమవంతు సహకారం అందించవచ్చని సూచించారు. 'ఆత్మనిర్భర్ భారత్' లక్ష్య సాధనలో సాంకేతికత, స్వచ్ఛ ఇంధన వినియోగం కీలక పాత్ర పోషిస్తాయని పేర్కొన్నారు. భవిష్యత్తు ఎలక్ట్రిక్ వాహనాలదేనని, యువత ముఖ్యంగా ఈ మార్పును స్వాగతించాలని ఆకాంక్షించారు.

# జహీరాబాద్‌లో పర్యాటక వారోత్సవాల ప్రారంభం

- ఎస్ఐహెచ్ఎంకు ఐదు కోట్ల మంజూరు ప్రకటన
- కొత్త కోర్సులు, ప్రవేశాలకు మంత్రి శ్రీకారం
- గ్రామీణ యువత ఉపాధిపై ప్రత్యేక దృష్టి



**జహీరాబాద్, మే 18 (తెలంగాణ ముచ్చట్లు):** 'ప్రజాపాలన - ప్రగతి ప్రణాళిక'లో భాగంగా జహీరాబాద్‌లోని స్టేట్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ హాస్పిటాలిటీ మేనేజ్‌మెంట్ సంస్థలో పర్యాటక వారోత్సవాలను మంత్రి జూపల్లి కృష్ణారావు ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎస్సీ కార్పొరేషన్ సహకారంతో కొత్తగా ప్రవేశపెట్టిన బేకరీ, కన్ఫెక్షనరీ కోర్సులను ప్రారంభించడంతో పాటు కొత్త విద్యా సంవత్సరానికి సంబంధించిన బీబీఏ, ఎంబీఏ కోర్సుల ప్రవేశాలను కూడా లాంఛనంగా ప్రారంభించారు. కార్యక్రమంలో భాగంగా పర్యాటక శాఖ రూపొందించిన 'టూరిస్ట్ గైడ్' పోస్టర్‌ను కూడా మంత్రి ఆవిష్కరించారు. సుదీర్ఘకాలంగా నిరుపయోగంగా ఉన్న ఎస్ఐహెచ్ఎంను తిరిగి ప్రారంభించడం సంతోషకరమని ఆయన పేర్కొన్నారు. విద్య, ఉపాధి అవకాశాల కల్పనలో ఈ సంస్థ కీలక పాత్ర పోషించబోతోందని తెలిపారు. ఈ సందర్భంగా మాట్లాడిన మంత్రి జూపల్లి కృష్ణారావు ఎస్ఐహెచ్ఎంను కార్పొరేట్ స్థాయిలో అభివృద్ధి చేసేందుకు ఐదు కోట్ల రూపాయలు మంజూరు చేస్తున్నట్లు ప్రకటించారు. గ్రామీణ ప్రాంత యువతలో వృత్తి నైపుణ్యాలను పెంపొందించి స్వయం ఉపాధి దిశగా వారిని ప్రోత్సహించడమే ప్రభుత్వ లక్ష్యమని వివరించారు.

గ్రామీణ ప్రాంతాలకు చెందిన ఎస్సీ, ఎస్టీ, బీసీ విద్యార్థులకు ఉపాధి అవకాశాలు కల్పించేందుకు ప్రభుత్వం ప్రత్యేక చర్యలు చేపడుతోందని తెలిపారు. సంస్థలో చేరిన పేద విద్యార్థులపై ఆర్థిక భారం పడకుండా వారికి స్టైఫండ్ అందించే దిశగా ప్రభుత్వం చర్యలు తీసుకుంటుందని వెల్లడించారు. సాంకేతిక పరిజ్ఞానం ప్రపంచాన్ని దగ్గర చేసిందని, ప్రైవేట్ రంగంలో ప్రస్తుతం అపారమైన అవకాశాలు ఉన్నాయని మంత్రి పేర్కొన్నారు. యువత పర్యాటక, ఆతిథ్య రంగాలపై ప్రత్యేక దృష్టి సారించి తమ నైపుణ్యాలను పెంపొందించుకోవాలని సూచించారు.

విద్యార్థులు కేవలం కోర్సులతోనే పరిమితం కాకుండా భాషా నైపుణ్యాలను కూడా అభివృద్ధి చేసుకోవాలని మంత్రి సూచించారు. విదేశీ భాషలు నేర్చుకోవడం ద్వారా అంతర్జాతీయ స్థాయిలో అవకాశాలు పెరుగుతాయని, పిల్లల భవిష్యత్తు కోసం తల్లిదండ్రులు కూడా వారిని ప్రోత్సహించాలని పిలుపునిచ్చారు.

# దిశ సమావేశంలో అభివృద్ధిపై సమీక్ష

- సంక్షేమ పథకాలు అర్హులకు చేరాలని సూచన
- అభివృద్ధి పనులు వేగవంతం చేయాలని ఆదేశం
- రుణ లక్ష్యాలు పూర్తి చేయాలని బ్యాంకర్లకు సూచన






**జోగులాంబ గద్వాల, మే 18 (తెలంగాణ ముచ్చట్లు):** జిల్లా అభివృద్ధి సమన్వయ, పర్యవేక్షణ కమిటీ దిశ సమావేశం జోగులాంబ గద్వాల జిల్లా కేంద్రంలోని ఐడీఓసీ సమావేశ మందిరంలో సోమవారం నిర్వహించారు. ఈ సమావేశానికి నాగర్‌కర్నూల్ పార్లమెంట్ సభ్యుడు మల్లు రవి హాజరై వివిధ శాఖల పనితీరును సమీక్షించారు. సంక్షేమ పథకాలు అర్హులైన ప్రతి ఒక్కరికి చేరేలా అధికారులు, ప్రజాప్రతినిధులు కలిసికట్టుగా పనిచేయాలని సూచించారు. సమావేశంలో జిల్లా కలెక్టర్ రిజ్వాన్ బాషా షేక్, ప్రజాప్రతినిధులు, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు. శాఖల వారీగా సమర్పించిన గణాంక నివేదికలను పరిశీలించిన ఎంపీ అభివృద్ధి కార్యక్రమాల అమలు తీరుపై సమీక్ష నిర్వహించారు.

ఈ సందర్భంగా మల్లు రవి మాట్లాడుతూ ప్రభుత్వం ప్రజా సంక్షేమమే లక్ష్యంగా అనేక కార్యక్రమాలు అమలు చేస్తోందన్నారు. అయితే క్షేత్రస్థాయిలో అధికారులు సమర్థవంతంగా అమలు చేయకపోతే ఆశించిన ఫలితాలు రావని వ్యాఖ్యానించారు. అర్హులైన ప్రతి ఒక్కరికి సంక్షేమ పథకాలు పారదర్శకంగా అందేలా చూడాలని సూచించారు. వ్యవసాయ, అనుబంధ రంగాలతో పాటు ఇతర రుణాల విషయంలో బ్యాంకులు నిర్దేశిత లక్ష్యాలను నూటికి నూరు శాతం చేరుకోవాలని ఆదేశించారు. పీఎం సురక్ష బీమా యోజన, పీఎం ఈజీపీ వంటి పథకాలపై విస్తృత ప్రచారం నిర్వహించి ప్రజలు వాటిని సద్వినియోగం చేసుకునేలా చర్యలు తీసుకోవాలని సూచించారు.

జిల్లాలోని సంక్షేమ వసతి గృహాల్లో ఖాళీగా ఉన్న సీట్లను అర్హులైన విద్యార్థులతో భర్తీ చేయాలని అధికారులకు ఆదేశించారు. వనమహోత్సవంలో భాగంగా నాటిన మొక్కల్లో ఎన్ని బతికాయో నివేదిక సమర్పించాలని సూచించారు. చేనేత కార్మికులు అధికంగా ఉన్న జిల్లాలో గద్వాల బ్రాండ్‌ను కాపాడేందుకు మార్కెటింగ్ అవకాశాలు పెంచాలని పేర్కొన్నారు. అభివృద్ధి పనులకు కేటాయించిన నిధులు పూర్తిస్థాయిలో వినియోగించేలా అధికారులు కృషి చేయాలని ఎంపీ పిలుపునిచ్చారు. సమావేశానికి గైర్హాజరైన అధికారులకు షోకాజ్ నోటీసులు జారీ చేయాలని కూడా ఆదేశించారు. ఈ సమావేశంలో ప్రజాప్రతినిధులు, బ్యాంకర్లు, అధికారులు తదితరులు పాల్గొన్నారు.



# అమెరికా-చైనా మధ్య భారీ వ్యవసాయ ఒప్పందం.. ట్రంప్ వ్యూహానికి ఫలితం?

**వాషింగ్టన్, మే 18 (తెలంగాణ ముచ్చట్లు):** అంతర్జాతీయ వాణిజ్య రంగంలో మరో కీలక పరిణామం చోటుచేసుకుంది. అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్, చైనా అధ్యక్షుడు షీ జిన్‌పింగ్ మధ్య ఇటీవల జరిగిన కీలక చర్చల అనంతరం వైట్ హౌస్ ఒక ముఖ్య ప్రకటన విడుదల చేసింది.

దీని ప్రకారం.. చైనా వచ్చే మూడు సంవత్సరాల్లో అమెరికా నుంచి భారీ స్థాయిలో వ్యవసాయ ఉత్పత్తులను కొనుగోలు చేయడానికి అంగీకరించింది. ప్రతి ఏడాది కనీసం 17 బిలియన్ డాలర్ల విలువైన వ్యవసాయ ఉత్పత్తులను దిగుమతి చేసుకుంటామని చైనా హామీ ఇచ్చినట్లు వెల్లడించింది. భారత కరెన్సీలో ఇది సుమారు రూ.1.4 లక్షల కోట్లకు సమానం. 2026, 2027, 2028 సంవత్సరాల్లో ఈ కొనుగోళ్లు నిరంతరాయంగా కొనసాగనున్నట్లు వైట్ హౌస్ స్పష్టం చేసింది. గత ఏడాది అక్టోబర్‌లో సోయాబీన్ కొనుగోళ్లకు సంబంధించిన ఒప్పందాలు దీనికి అదనమని తెలిపింది.

గత కొంతకాలంగా అమెరికా-చైనా మధ్య కొనసాగుతున్న వాణిజ్య యుద్ధం కారణంగా అమెరికా రైతులు తీవ్రంగా నష్టపోయారు. ఒకరిపై ఒకరు భారీ టారిఫ్‌లు విధించుకోవడంతో అమెరికా నుంచి చైనాకు జరిగే వ్యవసాయ ఎగుమతులు గణనీయంగా తగ్గిపోయాయి.

2025 నాటికి అమెరికా వ్యవసాయ ఎగుమతులు 65.7 శాతం పడిపోయి కేవలం 8.4 బిలియన్ డాలర్లకు పరిమితమయ్యాయి. ముఖ్యంగా సోయాబీన్ ఎగుమతుల్లో భారీ ప్రభావం కనిపించింది. 2016లో చైనా తన సోయాబీన్ అవసరాల్లో 41 శాతం అమెరికాపై ఆధారపడగా.. 2024 నాటికి అది 20 శాతానికి పడిపోయింది.

అయితే ఇప్పుడు ట్రంప్ ఒత్తిడి నేపథ్యంలో చైనా మళ్లీ అమెరికా వైపు మొగ్గుచూపినట్లు తెలుస్తోంది. ఈ క్రమంలో అమెరికా బీఫ్ కంపెనీలపై ఉన్న సస్పెన్షన్లను ఎత్తివేయడానికి చైనా అంగీకరించింది. అలాగే బర్డ్ ఫ్లూ ప్రభావం లేని అమెరికా రాష్ట్రాల నుంచి చికెన్ దిగుమతులను తిరిగి ప్రారంభించేందుకు కూడా గ్రీన్ సిగ్నల్ ఇచ్చింది.

ఈ తాజా ఒప్పందం వల్ల అమెరికా వ్యవసాయ రంగానికి పెద్ద ఊరటనిచ్చే అవకాశముందని ఆర్థిక నిపుణులు భావిస్తున్నారు. మరోవైపు, ప్రపంచ వాణిజ్య మార్కెట్లలో కూడా ఈ పరిణామం కీలక ప్రభావం చూపే అవకాశం ఉందని విశ్లేషకులు అంచనా వేస్తున్నారు.

# ఐఫోన్ 18 ప్రోలో భారీ మార్పులు..

**కుపర్టినో, మే 18 (తెలంగాణ ముచ్చట్లు):** యాపిల్ సంస్థ నుంచి రానున్న తదుపరి తరం ఐఫోన్ 18 ప్రో సిరీస్‌కు సంబంధించిన లీకులు టెక్ ప్రపంచంలో భారీ చర్చకు దారితీస్తున్నాయి. డిజైన్, కెమెరా, ప్రాసెసర్, బ్యాటరీ విభాగాల్లో ఈసారి యాపిల్ భారీ మార్పులు చేయబోతున్నట్లు సమాచారం.

ప్రస్తుతం వస్తున్న వివరాల ప్రకారం.. ఐఫోన్ 18 ప్రో మోడళ్లలో డిస్‌ప్లేపై ఉండే డైనమిక్ ఐలాండ్ పరిమాణాన్ని దాదాపు 35 శాతం వరకు తగ్గించనున్నట్లు తెలుస్తోంది. దీంతో ఫుల్ స్క్రీన్ అనుభవం మరింత మెరుగుపడనుంది. అలాగే ఫోన్ వెనుక గ్లాస్ బ్యాక్, మెటల్ ఫ్రేమ్ మధ్య ఎలాంటి గ్యాప్ కనిపించకుండా సీమ్‌లెస్ డిజైన్‌ను తీసుకురానున్నారు.

ఈ సిరీస్‌లో డార్క్ చెర్రీ, స్కై బ్లూ, సిల్వర్, డార్క్ గ్రే వంటి కొత్త రంగులను కూడా ప్రవేశపెట్టే అవకాశముందని టెక్ వర్గాలు చెబుతున్నాయి.

కెమెరా విభాగంలో మాత్రం యాపిల్ భారీ అప్‌గ్రేడ్ చేయనుంది. మొదటిసారిగా వేరియబుల్ అపెర్చర్ టెక్నాలజీని ప్రధాన కెమెరాలో అందించనున్నట్లు సమాచారం. దీని ద్వారా డీఎస్ఎల్ఆర్ కెమెరాల మాదిరిగా కాంతి ప్రవాహాన్ని నియంత్రించుకుని తక్కువ వెలుతురులో కూడా అద్భుతమైన ఫోటోలు తీసుకునే అవకాశం ఉంటుంది.

అలాగే కొత్త స్టాక్డ్ ఇమేజ్ సెన్సార్, పెద్ద అపెర్చర్ లెన్స్‌లు, సుదూర ఫోటోగ్రఫీ కోసం ప్రత్యేక జూమ్ టెక్నాలజీ కూడా ఈ ఫోన్లలో ఉండే అవకాశముంది.


డిస్‌ప్లే పరంగా కొత్త ఎల్‌టీపీఓ ప్లస్ టెక్నాలజీని ఉపయోగించనున్నారు. ఇది స్క్రీన్ క్వాలిటీని మెరుగుపరచడమే కాకుండా బ్యాటరీ వినియోగాన్ని కూడా తగ్గించనుంది.

ఈ ఫోన్లలో యాపిల్ అత్యంత శక్తివంతమైన ఏ20 ప్రో చిప్‌ను అమర్చనుంది. ప్రపంచంలోనే తొలిసారిగా 2 నానోమీటర్ టెక్నాలజీతో తయారవుతున్న ఈ చిప్ వల్ల పనితీరు భారీగా పెరగనుండగా.. బ్యాటరీ సామర్థ్యం కూడా గణనీయంగా మెరుగుపడనుంది.

ముఖ్యంగా ఐఫోన్ 18 ప్రో మాక్స్ మోడల్‌లో 5,000mAh కంటే ఎక్కువ సామర్థ్యం గల భారీ బ్యాటరీని అందించే అవకాశముందని లీకులు సూచిస్తున్నాయి. ఇది ఇప్పటివరకు వచ్చిన ఐఫోన్‌లలోనే అతిపెద్ద బ్యాటరీ అవుతుంది.

ఇక కనెక్టివిటీ విషయంలో కూడా యాపిల్ కొత్త టెక్నాలజీని జోడిస్తోంది. సెల్ సిగ్నల్ లేని ప్రాంతాల్లో కూడా శాటిలైట్ కమ్యూనికేషన్ ద్వారా అత్యవసర సందేశాలు పంపుకునే సదుపాయాన్ని మరింత విస్తరించనుంది.

అయితే యాపిల్ నుంచి ఇప్పటివరకు అధికారిక ప్రకటన రాకపోయినా.. ప్రస్తుతం వస్తున్న లీకులు టెక్ ప్రియుల్లో భారీ అంచనాలను పెంచుతున్నాయి.



తెలంగాణ TELANGANA MUCHATLU ముచ్చట్లు
ఎడిటర్ : బొల్లెపాక రాజేష్ తెలుగు దిన పత్రిక

# ప్రజాస్వామ్య స్ఫూర్తికి ప్రతిరూపం నీలం సంజీవరెడ్డి

- మాజీ రాష్ట్రపతి జయంతి ప్రత్యేక కథనం
- నిరాడంబర జీవితం, నిబద్ధతతో కూడిన రాజకీయ ప్రస్థానం
- భారత ప్రజాస్వామ్య చరిత్రలో చిరస్మరణీయ నాయకుడు



**డెస్క్, మే 18 (తెలంగాణ ముచ్చట్లు):** భారత రాజకీయ చరిత్రలో సాదాసీదా వ్యక్తిత్వం, క్రమశిక్షణ, ప్రజాసేవ పట్ల అంకితభావంతో ప్రత్యేక గుర్తింపు పొందిన నాయకుల్లో నీలం సంజీవరెడ్డి పేరు ముందు వరుసలో నిలుస్తుంది. దేశానికి ఆరవ రాష్ట్రపతిగా బాధ్యతలు నిర్వహించిన ఆయన జీవితం ఎంతో మందికి స్ఫూర్తిదాయకం. సాధారణ రైతు కుటుంబం నుంచి దేశ అత్యున్నత పదవిని అధిరోహించిన ఆయన ప్రయాణం భారత ప్రజాస్వామ్య చరిత్రలో ఒక ప్రత్యేక అధ్యాయంగా నిలిచిపోయింది. ప్రతి సంవత్సరం మే 19న ఆయన జయంతిని పురస్కరించుకుని దేశవ్యాప్తంగా ఆయన సేవలను స్మరించుకుంటారు. నీలం సంజీవరెడ్డి 1913 మే 19న ప్రస్తుత ఆంధ్రప్రదేశ్‌లోని అనంతపురం జిల్లా ఇల్లూరు గ్రామంలో జన్మించారు. వ్యవసాయ కుటుంబంలో జన్మించిన ఆయన చిన్నప్పటి నుంచే క్రమశిక్షణ, సామాజిక చైతన్యం వంటి విలువలను అలవర్చుకున్నారు. బాల్య దశ నుంచే దేశంలో జరుగుతున్న రాజకీయ పరిణామాలు ఆయనను ప్రభావితం చేశాయి. చదువుకునే రోజుల నుంచే దేశభక్తి భావాలు ఆయనలో బలంగా పెరిగాయి.

దేశ స్వాతంత్ర్య ఉద్యమం వేగంగా సాగుతున్న కాలంలో మహాత్మా గాంధీ ఆలోచనలు ఆయనపై తీవ్ర ప్రభావం చూపాయి. గాంధీ పిలుపు మేరకు స్వాతంత్ర్య సమరంలో పాల్గొనాలనే సంకల్పంతో ఆయన విద్యను కూడా పక్కన పెట్టారని చరిత్ర చెబుతుంది. జాతీయోద్యమంలో చురుకుగా పాల్గొంటూ బ్రిటీష్ పాలనకు వ్యతిరేకంగా పోరాడారు. స్వాతంత్ర్య ఉద్యమంలో భాగంగా ఆయన పలుమార్లు అరెస్టయ్యారు. జైలు జీవితం అనుభవించినా వెనక్కి తగ్గలేదు. దేశ స్వేచ్ఛ కోసం పోరాటం కొనసాగించారు. ఈ పోరాట అనుభవాలు ఆయనలో నాయకత్వ లక్షణాలను మరింత పెంచాయి. ప్రజల సమస్యలను అర్థం చేసుకునే దృక్పథాన్ని కూడా పెంపొందించాయి.

స్వాతంత్ర్యం అనంతరం ఆయన రాజకీయ ప్రస్థానం కొత్త దిశగా సాగింది. భారత జాతీయ కాంగ్రెస్‌లో కీలక నాయకుడిగా ఎదిగిన ఆయన ఆంధ్రప్రదేశ్ రాజకీయాల్లో ప్రధాన పాత్ర పోషించారు. ప్రజల సమస్యలను నేరుగా తెలుసుకుని పరిష్కరించాలనే తపనతో పనిచేశారు. ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర నిర్మాణం జరిగిన తరువాత రాష్ట్ర అభివృద్ధిలో ఆయన కీలక పాత్ర పోషించారు. రాష్ట్ర ముఖ్యమంత్రిగా బాధ్యతలు చేపట్టి పరిపాలనలో అనేక సంస్కరణలకు శ్రీకారం చుట్టారు. వ్యవసాయం, సాగునీరు, గ్రామీణ అభివృద్ధి అంశాలపై ప్రత్యేక దృష్టి పెట్టారు. ప్రజలకు అందుబాటులో ఉండే నాయకుడిగా మంచి పేరు సంపాదించారు.

నీలం సంజీవరెడ్డి రాజకీయాల్లో ఒక ప్రత్యేకమైన లక్షణం ఆయన నిరాడంబరత. పెద్ద పదవులు చేపట్టినా ఎప్పుడూ ఆడంబరాలకు దూరంగా ఉండేవారు. ప్రజల మధ్య కలిసిపోయే నాయకుడిగా గుర్తింపు పొందారు. రాజకీయాల్లో విలువలకు పెద్దపీట వేయడం ఆయన వ్యక్తిత్వంలోని ప్రధాన అంశంగా చెప్పబడుతుంది. జాతీయ రాజకీయాల్లో కూడా ఆయన తన ముద్ర వేశారు. కేంద్ర మంత్రిగా వివిధ బాధ్యతలు నిర్వహించారు. అనంతరం భారత పార్లమెంటు దిగువ సభకు స్పీకర్‌గా ఎన్నికయ్యారు. సభా నిర్వహణలో ఆయన నిష్పక్షపాత ధోరణి అందరి ప్రశంసలు అందుకుంది. ప్రతిపక్షం, అధికారపక్షం అనే తేడా లేకుండా సమానంగా వ్యవహరించారని అప్పటి నాయకులు పేర్కొన్నారు.

1969లో రాష్ట్రపతి ఎన్నికల్లో ఆయన పోటీ చేశారు. అయితే ఆ ఎన్నికల్లో విజయం సాధించలేకపోయారు. కానీ రాజకీయంగా వెనక్కి తగ్గకుండా తన ప్రయాణాన్ని కొనసాగించారు. ఆ తర్వాత దేశ రాజకీయాల్లో చోటుచేసుకున్న మార్పులతో ఆయనకు మరింత ప్రాధాన్యం పెరిగింది. 1977లో భారతదేశ ఆరవ రాష్ట్రపతిగా నీలం సంజీవరెడ్డి ఎన్నికయ్యారు. దేశ చరిత్రలో పోటీ లేకుండా ఏకగ్రీవంగా ఎన్నికైన ఏకైక రాష్ట్రపతిగా ఆయన పేరు నిలిచిపోయింది. ఇది ఆయనకు అన్ని వర్గాల నాయకుల్లో ఉన్న గౌరవాన్ని ప్రతిబింబించింది. రాష్ట్రపతిగా ఉన్న సమయంలో దేశంలో రాజకీయ అస్థిర పరిస్థితులు ఎదురయ్యాయి. ప్రభుత్వ మార్పులు, రాజకీయ సంక్షోభాలు చోటుచేసుకున్నాయి. అలాంటి పరిస్థితుల్లో కూడా రాజ్యాంగ విలువలను కాపాడుతూ ఆయన సమతుల్యంగా వ్యవహరించారు. దేశ అత్యున్నత పదవిలో ఉన్న వ్యక్తిగా తన బాధ్యతలను సమర్థంగా నిర్వర్తించారు. రాజకీయాల్లో ఉన్నప్పటికీ ఆయన జీవితం ఎంతో సరళంగా సాగేది. అధికార హోదా కన్నా బాధ్యతకు ఎక్కువ ప్రాధాన్యం ఇచ్చేవారు. పదవి అంటే సేవ చేయడానికి వచ్చిన అవకాశం అని ఆయన నమ్మేవారు. అందుకే ఆయనను అనేక మంది ఆదర్శ నాయకుడిగా భావిస్తారు.

రాష్ట్రపతి పదవీకాలం పూర్తైన తర్వాత కూడా ఆయన ప్రజా జీవితానికి దూరం కాలేదు. సామాజిక అంశాలపై ఆసక్తి చూపుతూ ప్రజలతో అనుబంధం కొనసాగించారు. రాజకీయ నాయకత్వం అంటే అధికార ప్రదర్శన కాదని, ప్రజలకు సేవ చేయడమే అసలైన బాధ్యత అని తన జీవితం ద్వారా చూపించారు. 1996 జూన్ 1న నీలం సంజీవరెడ్డి కన్నుమూశారు. కానీ ఆయన ఆలోచనలు, ప్రజాసేవ పట్ల అంకితభావం, ప్రజాస్వామ్య విలువల పట్ల నిబద్ధత ఇప్పటికీ గుర్తుండిపోయాయి. నేటి రాజకీయ నాయకత్వానికి కూడా ఆయన జీవితం ఒక మార్గదర్శకంగా నిలుస్తోంది.

నీలం సంజీవరెడ్డి జయంతి సందర్భంగా ఆయన సేవలను స్మరించుకోవడం కేవలం నివాళి మాత్రమే కాదు. ప్రజాస్వామ్య విలువలు, నిజాయితీ, నిబద్ధతతో కూడిన రాజకీయాల అవసరాన్ని గుర్తు చేసుకోవాల్సిన సందర్భం కూడా. భారత రాజకీయ చరిత్రలో ఆయన పేరు ఎప్పటికీ చెరగని ముద్రగా నిలిచిపోతుంది.



# బంగారం ధర మళ్లీ తగ్గింది.. వెండి మాత్రం భగ్గుమంటోంది

**హైదరాబాద్, మే 18 (తెలంగాణ ముచ్చట్లు):** దేశంలో బంగారం ధరలు మరోసారి తగ్గుముఖం పట్టాయి. గత వారం చివరి రెండు రోజులుగా భారీగా తగ్గిన పసిడి ధరలు.. ఈ వారం ప్రారంభంలో కూడా అదే ధోరణిని కొనసాగిస్తున్నాయి. అయితే వెండి ధరలు మాత్రం ఒక్కసారిగా భారీగా పెరిగాయి.

గుడ్ రిటర్న్స్ వెబ్‌సైట్ వివరాల ప్రకారం.. నేడు ఉదయం 10:30 గంటల సమయానికి హైదరాబాద్ బులియన్ మార్కెట్‌లో 24 క్యారెట్ల 10 గ్రాముల బంగారం ధర రూ.1,56,220కు చేరుకుంది. క్రితం ముగింపు ధరతో పోలిస్తే రూ.710 మేర తగ్గింది.

అదే సమయంలో 22 క్యారెట్ల 10 గ్రాముల పసిడి ధర కూడా రూ.650 తగ్గి రూ.1,43,200 వద్ద కొనసాగుతోంది. విజయవాడలో కూడా ఇదే ధరలు నమోదయ్యాయి.

ఇక వెండి ధర మాత్రం భారీగా పెరిగింది. హైదరాబాద్‌లో కిలో వెండి ధర ఏకంగా రూ.10 వేల మేర ఎగబాకి రూ.3 లక్షల మార్క్‌ను తాకింది.

దేశంలోని ఇతర ప్రధాన నగరాల్లో కూడా బంగారం ధరల్లో మార్పులు కనిపించాయి. చెన్నైలో 24 క్యారెట్ల 10 గ్రాముల పసిడి ధర రూ.1,60,910గా కొనసాగుతుండగా.. ముంబైలో రూ.1,56,220, దేశ రాజధాని న్యూఢిల్లీలో రూ.1,56,370గా నమోదైంది.

అలాగే 22 క్యారెట్ల 10 గ్రాముల బంగారం ధర చెన్నైలో రూ.1,47,500గా ఉండగా.. ముంబైలో రూ.1,43,200, న్యూఢిల్లీలో రూ.1,43,550గా కొనసాగుతోంది.

వెండి ధరల విషయానికి వస్తే.. చెన్నైలో కిలో వెండి ధర రూ.3 లక్షలకు చేరుకోగా.. దేశంలోని ఇతర ప్రధాన నగరాల్లో రూ.2.90 లక్షల వరకు నమోదవుతోంది.

అంతర్జాతీయ మార్కెట్‌లో ముడి చమురు ధరల మార్పులు, డాలర్ బలపడటం, గ్లోబల్ ఆర్థిక అనిశ్చితులు బంగారం ధరలపై ప్రభావం చూపుతున్నాయని మార్కెట్ నిపుణులు చెబుతున్నారు.



# డాలర్‌తో పోలిస్తే రూపాయి చరిత్రలోనే కనిష్ఠానికి.. మార్కెట్లలో ఆందోళన

**న్యూఢిల్లీ, మే 18 (తెలంగాణ ముచ్చట్లు):** భారత రూపాయి విలువ సోమవారం చరిత్రలోనే కనిష్ఠ స్థాయికి పడిపోయింది. అమెరికన్ డాలర్‌తో పోలిస్తే రూపాయి మారకం విలువ 0.2 శాతం క్షీణించి రూ.96.20 వద్దకు చేరుకుంది. దీంతో రూపాయి ఆల్‌టైమ్ లో స్థాయిని నమోదు చేసింది.

పశ్చిమాసియాలో కొనసాగుతున్న ఉద్రిక్త పరిస్థితులు, అంతర్జాతీయ మార్కెట్లలో పెరిగిన అనిశ్చితి కారణంగా రూపాయిపై తీవ్ర ఒత్తిడి ఏర్పడింది. ఇప్పటికే గత శుక్రవారం తొలిసారిగా డాలర్‌తో పోలిస్తే రూపాయి రూ.96 మార్క్‌ను దాటగా.. సోమవారం మరింత బలహీనపడింది.

ముఖ్యంగా అంతర్జాతీయ మార్కెట్లో ముడి చమురు ధరలు భారీగా పెరగడం రూపాయి పతనానికి ప్రధాన కారణంగా మారింది. యూఏఈలోని అణు విద్యుత్ కేంద్రంపై దాడి జరిగిందన్న వార్తలతో బ్రెంట్ క్రూడ్ ధర బ్యారెల్‌కు 111 డాలర్లకు చేరుకుంది. అలాగే ఇరాన్‌పై అమెరికా సైనిక చర్యలకు దిగే అవకాశాలు ఉన్నాయన్న సంకేతాలు ప్రపంచ మార్కెట్లలో భయాందోళనలు పెంచుతున్నాయి.

ఈ పరిణామాలతో ప్రపంచవ్యాప్తంగా డాలర్‌కు డిమాండ్ పెరగడంతో.. అభివృద్ధి చెందుతున్న దేశాల కరెన్సీలు ఒత్తిడిని ఎదుర్కొంటున్నాయి. అందులో భాగంగా భారత రూపాయి కూడా భారీ పతనాన్ని చవిచూసింది.


రూపాయి బలహీనత ప్రభావం దేశీయ స్టాక్ మార్కెట్లపైనా కనిపించింది. సోమవారం ప్రారంభ ట్రేడింగ్‌లో సెన్సెక్స్ 808 పాయింట్లు, నిఫ్టీ 247 పాయింట్లు నష్టపోయాయి. పెట్టుబడిదారుల్లో ఆందోళన వాతావరణం నెలకొంది.

ఇక రూపాయి పతనాన్ని అరికట్టేందుకు కేంద్ర ప్రభుత్వం, భారతీయ రిజర్వు బ్యాంక్ చర్యలు చేపట్టాయి. వెండి దిగుమతులపై కొన్ని ఆంక్షలు విధించడంతో పాటు.. కరెన్సీ మార్కెట్‌లో ఆర్బీఐ జోక్యం చేసుకుంటున్నట్లు సమాచారం.

అయితే పశ్చిమాసియా ఉద్రిక్తతలు కొనసాగుతున్న నేపథ్యంలో ఈ వారమంతా రూపాయిపై ఒత్తిడి కొనసాగే అవకాశముందని మార్కెట్ విశ్లేషకులు అభిప్రాయపడుతున్నారు.

# కుటుంబ ఆరోగ్యానికి అండగా కుటుంబ వైద్యులు

- ప్రపంచ కుటుంబ వైద్యుల దినోత్సవం ప్రత్యేకం
- ఆరోగ్యానికి తొలి రక్షకులు
- కుటుంబంతో అనుబంధం కలిగిన వైద్యులు
- సమాజ ఆరోగ్యానికి బలమైన ఆధారం



**డెస్క్, మే 18 (తెలంగాణ ముచ్చట్లు):** ప్రపంచవ్యాప్తంగా ప్రజల ఆరోగ్య సంరక్షణలో కుటుంబ వైద్యుల పాత్ర ఎంతో కీలకమైనది. ప్రతి కుటుంబంలో ఆరోగ్య సమస్య వచ్చినప్పుడు ముందుగా గుర్తుకు వచ్చే వ్యక్తుల్లో కుటుంబ వైద్యుడు ఒకరు. వారి సేవలను గుర్తించి గౌరవించేందుకు ప్రతి సంవత్సరం మే 19న ప్రపంచ కుటుంబ వైద్యుల దినోత్సవాన్ని నిర్వహిస్తున్నారు. ఈ దినోత్సవం ద్వారా సమాజంలో కుటుంబ వైద్యుల ప్రాధాన్యంపై అవగాహన కల్పించడం ప్రధాన ఉద్దేశంగా ఉంటుంది.

ఆరోగ్య వ్యవస్థలో కుటుంబ వైద్యులు ఒక కీలక వారధిగా పనిచేస్తారు. సాధారణ ఆరోగ్య సమస్యల నుంచి దీర్ఘకాలిక వ్యాధుల వరకు ప్రజలకు మొదటి స్థాయి వైద్య సేవలు అందిస్తారు. రోగి పరిస్థితిని అర్థం చేసుకుని సరైన మార్గంలో చికిత్స అందించడంలో కుటుంబ వైద్యులు ప్రత్యేక పాత్ర పోషిస్తారు. కుటుంబ వైద్యుల ప్రధాన ప్రత్యేకత కుటుంబ సభ్యుల ఆరోగ్య చరిత్రపై వారికి అవగాహన ఉండటమే. ఒక వ్యక్తి గతంలో ఎదుర్కొన్న అనారోగ్య పరిస్థితులు, వంశపారంపర్య వ్యాధులు, జీవనశైలి వంటి అంశాలు తెలిసి ఉండటం వల్ల త్వరగా సరైన చికిత్స అందించే అవకాశం ఉంటుంది. ఇది రోగ నిర్ధారణలో ఎంతో ఉపయోగపడుతుంది.

గతంలో ప్రతి ప్రాంతంలో కుటుంబ వైద్యుల సేవలు ఎక్కువగా ఉండేవి. చిన్న పిల్లలకు జ్వరం వచ్చినా, వృద్ధులకు ఆరోగ్య సమస్యలు వచ్చినా కుటుంబ సభ్యులు ముందుగా కుటుంబ వైద్యుడినే సంప్రదించేవారు. వైద్యుడు కూడా కుటుంబ సభ్యుల పరిస్థితులను తెలుసుకుని అవసరమైన సూచనలు అందించేవారు. ఆధునిక కాలంలో వైద్య రంగంలో ఎన్నో మార్పులు చోటుచేసుకున్నాయి. సూపర్ స్పెషాలిటీ ఆస్పత్రులు, ఆధునిక పరీక్షలు, ప్రత్యేక వైద్య సేవలు అందుబాటులోకి వచ్చినా కుటుంబ వైద్యుల అవసరం తగ్గలేదని నిపుణులు చెబుతున్నారు. మొదటి స్థాయిలో సరైన వైద్య సలహా ఇవ్వడంలో కుటుంబ వైద్యుల పాత్ర ఇప్పటికీ కీలకంగానే ఉంది.

గ్రామీణ ప్రాంతాల్లో కుటుంబ వైద్యుల అవసరం మరింత ఎక్కువగా కనిపిస్తుంది. పెద్ద ఆస్పత్రులు అందుబాటులో లేని ప్రాంతాల్లో ప్రజలకు కుటుంబ వైద్యులే ప్రధాన ఆధారంగా ఉంటారు. ఆరోగ్య సమస్యలను ప్రారంభ దశలో గుర్తించి సరైన సూచనలు ఇవ్వడం ద్వారా వారు ప్రజలకు ఉపయోగపడుతున్నారు. కుటుంబ వైద్యులు చికిత్స మాత్రమే కాదు, ఆరోగ్యంపై అవగాహన కార్యక్రమాలు కూడా నిర్వహిస్తుంటారు. సమతుల్య ఆహారం తీసుకోవడం, వ్యాయామం చేయడం, మానసిక ఆరోగ్యాన్ని కాపాడుకోవడం, పరిశుభ్రత పాటించడం వంటి విషయాలపై ప్రజలకు సూచనలు అందిస్తారు. ప్రస్తుతం ప్రపంచవ్యాప్తంగా జీవనశైలి మార్పుల వల్ల అనేక దీర్ఘకాలిక వ్యాధులు పెరుగుతున్నాయి. మధుమేహం, రక్తపోటు, ఊబకాయం, గుండె సంబంధిత వ్యాధులు ప్రజలను ప్రభావితం చేస్తున్నాయి. ఈ సమస్యలను నియంత్రించడంలో కుటుంబ వైద్యులు నిరంతర పర్యవేక్షణ ద్వారా ముఖ్యపాత్ర పోషిస్తున్నారు.

కరోనా కాలంలో కుటుంబ వైద్యుల సేవలు మరింత స్పష్టంగా కనిపించాయి. ప్రజల్లో భయం నెలకొన్న సమయంలో కుటుంబ వైద్యులు అవసరమైన సూచనలు అందించి మానసిక ధైర్యం కల్పించారు. ఇంటి వద్దే ప్రాథమిక వైద్య సూచనలు అందించి అనేక కుటుంబాలకు అండగా నిలిచారు. ప్రపంచ కుటుంబ వైద్యుల దినోత్సవం సమాజంలో వారి సేవలను గుర్తుచేసే ముఖ్యమైన రోజు. ప్రజల ఆరోగ్య రక్షణలో కుటుంబ వైద్యులు అందిస్తున్న సేవలు ఎంతో విలువైనవి. ఆరోగ్యవంతమైన సమాజ నిర్మాణానికి కుటుంబ వైద్యుల పాత్ర ఎప్పటికీ ప్రత్యేకంగానే ఉంటుంది.

# హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంక్‌ను దాటేసిన ఎయిర్‌టెల్..







**ముంబై, మే 18 (తెలంగాణ ముచ్చట్లు):** టెలికాం దిగ్గజం భారతీ ఎయిర్‌టెల్ దేశీయ స్టాక్ మార్కెట్లో సరికొత్త రికార్డు సృష్టించింది. మార్కెట్ క్యాపిటలైజేషన్ పరంగా హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంక్‌ను వెనక్కి నెట్టి దేశంలో రెండో అత్యంత విలువైన కంపెనీగా అవతరించింది.

సోమవారం ట్రేడింగ్‌లో ఎయిర్‌టెల్ షేర్లు 2 శాతానికి పైగా లాభపడటంతో కంపెనీ మార్కెట్ క్యాప్ రూ.11.90 లక్షల కోట్లకు చేరింది. అదే సమయంలో హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంక్ మార్కెట్ విలువ రూ.11.86 లక్షల కోట్లుగా నమోదైంది. దీంతో ఎయిర్‌టెల్ రెండో స్థానాన్ని దక్కించుకుంది.

ప్రస్తుతం రూ.18.09 లక్షల కోట్ల మార్కెట్ క్యాప్‌తో రిలయన్స్ ఇండస్ట్రీస్ దేశంలో అత్యంత విలువైన కంపెనీగా మొదటి స్థానంలో కొనసాగుతోంది.

గత వారం రోజుల వ్యవధిలో ఎయిర్‌టెల్ షేర్లు దాదాపు 10 శాతం మేర లాభపడటం విశేషం. మరోవైపు హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంక్ షేర్లు కేవలం 1 శాతం మాత్రమే పెరిగాయి. గత ఆరు నెలల్లో హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంక్ షేర్లు 22 శాతం వరకు పడిపోవడం గమనార్హం. బ్యాంక్ పార్ట్‌టైమ్ ఛైర్మన్ అతాను చక్రవర్తి రాజీనామా చేయడం మార్కెట్ సెంటిమెంట్‌పై ప్రభావం చూపినట్లు విశ్లేషకులు భావిస్తున్నారు.

ఆర్థిక ఫలితాల పరంగా చూస్తే.. మార్చి 31తో ముగిసిన త్రైమాసికంలో హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంక్ స్థిరమైన వృద్ధిని నమోదు చేసింది. బ్యాంక్ నికర లాభం 10.9 శాతం పెరిగి రూ.1,912 కోట్లకు చేరుకుంది. నికర ఆదాయం కూడా 3.2 శాతం వృద్ధితో రూ.3,380 కోట్లుగా నమోదైంది. నిరర్థక ఆస్తులు 1.15 శాతం వద్ద స్థిరంగా ఉన్నాయి.

మరోవైపు భారతీ ఎయిర్‌టెల్ నికర లాభం మాత్రం తగ్గింది. ప్రస్తుత త్రైమాసికంలో కంపెనీ రూ.7,325 కోట్ల నికర లాభాన్ని నమోదు చేసింది. గత ఏడాది ఇదే కాలంలో ఇది రూ.11,021 కోట్లుగా ఉంది. గత ఏడాది లాభాల్లో రూ.2,892 కోట్ల పన్ను మినహాయింపు కలిసివచ్చిందని, అందుకే ఈసారి లాభాల్లో తగ్గుదల కనిపించిందని కంపెనీ వివరణ ఇచ్చింది.

# ఫ్రంట్ లోడ్‌నా..? టాప్ లోడ్‌నా..?



**హైదరాబాద్, మే 18 (తెలంగాణ ముచ్చట్లు):** ప్రస్తుతం ప్రతి ఇంట్లోనూ వాషింగ్ మెషీన్ అవసరమైన గృహోపకరణంగా మారిపోయింది. అయితే కొత్తగా వాషింగ్ మెషీన్ కొనాలనుకునే వారు ఎక్కువగా ఫ్రంట్ లోడ్, టాప్ లోడ్ మోడళ్లలో ఏది మంచిదనే సందేహంలో పడుతుంటారు. ఈ రెండు రకాల మెషీన్ల మధ్య ఉన్న ప్రధాన తేడాలు ఇప్పుడు తెలుసుకుందాం.

ఫ్రంట్ లోడ్ వాషింగ్ మెషీన్:

ముందు భాగంలో డోర్ ఉండే ఈ మెషీన్లు ఆధునిక టంబ్లింగ్ టెక్నాలజీతో పనిచేస్తాయి. బట్టలను సున్నితంగా తిప్పుతూ లోతుగా శుభ్రం చేస్తాయి. దీంతో బట్టలు ఎక్కువ కాలం మృదువుగా ఉంటాయి.

ఇవి నీరు, విద్యుత్ వినియోగాన్ని గణనీయంగా తగ్గిస్తాయి. సాధారణంగా టాప్ లోడ్ మెషీన్లతో పోలిస్తే 30 నుంచి 40 శాతం వరకు నీటి ఆదా జరుగుతుంది.

ఇందులో బట్టలు అధిక వేగంతో తిరగడం వల్ల నీరు త్వరగా పిండబడి బట్టలు వేగంగా ఆరిపోతాయి.

అయితే వీటి ధర ఎక్కువగా ఉంటుంది. అలాగే వాషింగ్ సైకిల్ ప్రారంభమైన తర్వాత మధ్యలో అదనపు బట్టలు వేయడం సాధ్యం కాదు.

టాప్ లోడ్ వాషింగ్ మెషీన్:

పై భాగంలో మూత ఉండే ఈ మెషీన్లు తక్కువ ధరలో లభిస్తాయి. బట్టలు వేయడానికి లేదా తీసేందుకు వంగాల్సిన అవసరం లేకపోవడంతో వృద్ధులకు, వెన్నునొప్పి ఉన్నవారికి ఇవి సౌకర్యంగా ఉంటాయి.

ఇందులో వాషింగ్ జరుగుతున్నప్పటికీ మధ్యలో మూత తీసి అదనపు బట్టలు వేయవచ్చు.

అయితే ఇవి ఎక్కువ నీటిని వినియోగిస్తాయి. అలాగే ఇంపెల్లర్ లేదా అజిటేటర్ వల్ల బట్టలు ఒకదానికొకటి ముడిపడి త్వరగా పాడయ్యే అవకాశం ఉంటుంది.

ఏది కొనాలి..?

నీరు, కరెంట్ ఆదా కావాలని.. బట్టలు ఎక్కువకాలం కొత్తలా ఉండాలని భావించే వారికి ఫ్రంట్ లోడ్ ఉత్తమ ఎంపికగా చెప్పవచ్చు.

తక్కువ బడ్జెట్‌లో, సులభంగా ఉపయోగించుకునే, తక్కువ మెయింటెనెన్స్ ఉండే మెషీన్ కావాలనుకునే వారికి టాప్ లోడ్ సరైన ఎంపికగా నిపుణులు సూచిస్తున్నారు.



# ఖర్చుల కోతకు కేంద్రం కీలక ఆదేశాలు..

- ప్రభుత్వ బ్యాంకులకు పొదుపు సూచనలు

**న్యూఢిల్లీ, మే 18 (తెలంగాణ ముచ్చట్లు):** పశ్చిమాసియా ఉద్రిక్తతల నేపథ్యంలో ఆర్థిక ప్రభావాలను తగ్గించేందుకు కేంద్ర ప్రభుత్వం కీలక నిర్ణయం తీసుకుంది. దేశంలోని ప్రభుత్వ రంగ బ్యాంకులు, ప్రభుత్వ బీమా సంస్థలు, ఆర్థిక సంస్థలు ఖర్చులను భారీగా తగ్గించుకోవాలని కేంద్ర ఆర్థిక మంత్రిత్వ శాఖ ఆదేశాలు జారీ చేసింది.

ఆర్థిక క్రమశిక్షణ, పొదుపు చర్యల్లో భాగంగా ప్రయాణాలపై పరిమితులు విధించడంతో పాటు.. దశలవారీగా ఎలక్ట్రిక్ వాహనాల వినియోగానికి మారాలని స్పష్టం చేసింది. ఈ ఆదేశాలు స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా, బ్యాంక్ ఆఫ్ బరోడా, ఎల్ఐసీ వంటి ప్రభుత్వ రంగ దిగ్గజ సంస్థలతో పాటు దేశవ్యాప్తంగా ఉన్న అనుబంధ సంస్థలకు కూడా వర్తించనున్నాయి.

కేంద్ర ఆర్థిక సేవల విభాగం విడుదల చేసిన మార్గదర్శకాల ప్రకారం.. అత్యవసర పరిస్థితులు తప్ప అన్ని సమావేశాలు, సమీక్షలు, చర్చలను వీడియో కాన్ఫరెన్స్ ద్వారానే నిర్వహించాలని సూచించింది.

అలాగే చైర్మన్లు, మేనేజింగ్ డైరెక్టర్లు, సీఈఓల విదేశీ ప్రయాణాలపై కూడా పరిమితులు విధించింది. వీలైనంత వరకు అంతర్జాతీయ సమావేశాలకు వర్చువల్ విధానంలోనే హాజరుకావాలని పేర్కొంది.

ఇక ప్రధాన కార్యాలయాలు, బ్రాంచ్ కార్యాలయాల్లో ప్రస్తుతం అద్దెకు వినియోగిస్తున్న పెట్రోల్, డీజిల్ వాహనాల స్థానంలో క్రమంగా ఎలక్ట్రిక్ కార్లను వినియోగంలోకి తీసుకురావాలని కేంద్రం స్పష్టం చేసింది.

ప్రపంచవ్యాప్తంగా పెరుగుతున్న ఉద్రిక్తతల కారణంగా ఆర్థిక వ్యవస్థపై ఒత్తిడి పెరుగుతున్న నేపథ్యంలో ప్రధానమంత్రి నరేంద్ర మోదీ ఇటీవలే పొదుపు చర్యలు పాటించాలని పిలుపునిచ్చిన విషయం తెలిసిందే.

పశ్చిమాసియాలో కొనసాగుతున్న ఉద్రిక్తతల ప్రభావంతో చమురు ధరలు పెరగడం, రూపాయి విలువ బలహీనపడటం, ద్రవ్యోల్బణ ఒత్తిడి పెరగడం వంటి పరిస్థితులు దేశ ఆర్థిక వ్యవస్థపై ప్రభావం చూపుతున్నాయి. ఇప్పటికే కొన్ని రాష్ట్ర ప్రభుత్వాలు కూడా ఖర్చులను తగ్గించుకునే దిశగా ఉద్యోగులకు వారంలో రెండు రోజుల పాటు 'వర్క్ ఫ్రమ్ హోమ్' సదుపాయాన్ని కల్పిస్తున్నాయి.

# పోస్ట్ ఆఫీస ఆర్డీతో భద్రమైన పొదుపు..



**హైదరాబాద్, మే 18 (తెలంగాణ ముచ్చట్లు):** భద్రతతో కూడిన పెట్టుబడులను కోరుకునే మధ్యతరగతి ప్రజలకు ఇండియా పోస్ట్ అందిస్తున్న చిన్న పొదుపు పథకాలు మంచి ఆదరణ పొందుతున్నాయి. ముఖ్యంగా ఎలాంటి మార్కెట్ రిస్క్ లేకుండా స్థిరమైన రాబడిని ఆశించే వారికి పోస్ట్ ఆఫీస్ రికరింగ్ డిపాజిట్ పథకం ఉత్తమ ఎంపికగా నిపుణులు సూచిస్తున్నారు.

ఈ పథకం బ్యాంకుల రికరింగ్ డిపాజిట్‌ల మాదిరిగానే పనిచేస్తుంది. ఇందులో ప్రతి నెలా ఒక నిర్ణీత మొత్తాన్ని జమ చేయాల్సి ఉంటుంది. ప్రస్తుతం ఈ పథకంపై వార్షిక వడ్డీ రేటు 6.7 శాతంగా అమల్లో ఉంది. పథకం కాలపరిమితి 5 సంవత్సరాలు లేదా 60 నెలలు.

పోస్ట్ ఆఫీస్ ఆర్డీలో కనీసంగా నెలకు రూ .100తోనే పెట్టుబడి ప్రారంభించవచ్చు. గరిష్ఠ పరిమితి లేకపోవడం ఈ పథకం ప్రత్యేకతగా చెప్పవచ్చు. అంటే పెట్టుబడిదారులు తమ ఆర్థిక సామర్థ్యానికి అనుగుణంగా ఎంత మొత్తమైనా ప్రతి నెలా జమ చేయవచ్చు.

ఉదాహరణకు.. ఒకరు ప్రతి నెలా రూ.5 వేల చొప్పున 5 సంవత్సరాల పాటు క్రమం తప్పకుండా జమ చేస్తే.. మొత్తం పెట్టుబడి రూ.3 లక్షలు అవుతుంది.

ప్రస్తుతం అమల్లో ఉన్న 6.7 శాతం వడ్డీ రేటు ప్రకారం మెచ్యూరిటీ సమయంలో సుమారు రూ.3,56,830 వరకు లభిస్తుంది. అంటే పెట్టుబడిదారుడికి దాదాపు రూ.56,830 వరకు వడ్డీ రూపంలో అదనపు ఆదాయం వస్తుంది.

రిస్క్ లేకుండా క్రమబద్ధమైన పొదుపు చేయాలనుకునే వారికి ఈ పథకం మంచి అవకాశంగా భావిస్తున్నారు.

పిల్లల విద్య, కుటుంబ భద్రత, అత్యవసర అవసరాలు లేదా భవిష్యత్ ఖర్చుల కోసం చిన్న మొత్తాలతో పెద్ద నిధిని సృష్టించుకోవాలనుకునే వారికి పోస్ట్ ఆఫీస్ ఆర్డీ పథకం ఎంతో ఉపయోగకరంగా ఉంటుందని ఆర్థిక నిపుణులు చెబుతున్నారు.



# రైలులో మహిళ మృతదేహం కలకలం

- స్లీపర్ కోచ్‌లో అనుమానాస్పద ఇనుప పెట్టె గుర్తింపు
- మృతదేహ భాగాలు లభ్యమవడంతో సంచలనం
- సీసీటీవీ దృశ్యాలతో దర్యాప్తు ప్రారంభం

**లక్నో, మే 18 (తెలంగాణ ముచ్చట్లు):** ఉత్తరప్రదేశ్‌లోని లక్నోలో ఓ రైలులో మహిళ మృతదేహం భాగాలు లభ్యమవడంతో తీవ్ర కలకలం రేగింది. స్లీపర్ కోచ్‌లో అనుమానాస్పదంగా వదిలిపెట్టిన ఇనుప పెట్టె, బ్యాగ్‌లో మృతదేహ భాగాలు గుర్తించిన ఘటన రైల్వే ప్రయాణికులు, అధికారులను దిగ్భ్రాంతికి గురి చేసింది. ఈ ఘటనపై రైల్వే పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. బీహార్‌లోని ఛప్రా నుంచి బయలుదేరిన ఎక్స్‌ప్రెస్ రైలు లక్నోలోని గోమతి నగర్ రైల్వే స్టేషన్‌కు చేరుకుని ప్రయాణాన్ని ముగించింది. అనంతరం సోమవారం ఉదయం పారిశుధ్య సిబ్బంది కోచ్‌లలో శుభ్రత పనులు చేపడుతుండగా స్లీపర్ కోచ్ సీటు కింద అనుమానాస్పదంగా ఉన్న ఇనుప పెట్టె, ఒక బ్యాగ్ కనిపించాయి. పెట్టె, బ్యాగ్‌పై రక్తపు మరకలు ఉండటంతో అనుమానం వచ్చిన సిబ్బంది వెంటనే రైల్వే అధికారులకు సమాచారం అందించారు. సమాచారం అందుకున్న అధికారులు సంఘటన స్థలానికి చేరుకుని పరిశీలనలు చేపట్టారు. అనంతరం ఇనుప పెట్టె తాళం పగులగొట్టి చూడగా అందులో మహిళ మృతదేహ భాగాలు కనిపించడంతో ఒక్కసారిగా కలకలం చెలరేగింది.

ప్రాథమిక విచారణలో మహిళ మృతదేహాన్ని ముక్కలుగా నరికి పెట్టె, బ్యాగ్‌లలో ఉంచినట్లు పోలీసులు అనుమానిస్తున్నారు. మృతురాలి మొండెం, తల భాగాలను పెట్టెలో ఉంచగా, చేతులు, కాళ్ల భాగాలను ప్లాస్టిక్ సంచుల్లో ప్యాక్ చేసి బ్యాగ్‌లో దాచినట్లు గుర్తించారు. మృతురాలి వయస్సు ఇరవై ఐదు నుంచి ముప్పై సంవత్సరాల మధ్య ఉండవచ్చని అధికారులు అంచనా వేస్తున్నారు. గొంతు కోసి హత్య చేసిన అనంతరం ఆధారాలు దాచిపెట్టేందుకు ఈ చర్యకు పాల్పడి ఉండవచ్చని అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. ఈ ఘటనపై రైల్వే పోలీసులు ప్రత్యేక దర్యాప్తు చేపట్టారు. రైలు ప్రయాణించిన మార్గంలోని అన్ని రైల్వే స్టేషన్లలో సీసీటీవీ దృశ్యాలను పరిశీలిస్తూ నిందితుల ఆచూకీ కోసం గాలింపు చర్యలు కొనసాగిస్తున్నారు.

# ఎన్‌పీఎస్‌లో కొత్త పెన్షన్ విధానం


- రిటైర్మెంట్ తర్వాత విడతల వారీగా నగదు అవకాశం

డెస్క్, మే 18 (తెలంగాణ ముచ్చట్లు): రిటైర్మెంట్ తర్వాత చేతికి వచ్చే పెన్షన్ సొమ్మును ఒకేసారి తీసుకోకుండా విడతల వారీగా పొందే కొత్త అవకాశాన్ని నేషనల్ పెన్షన్ సిస్టమ్ పరిచయం చేసింది. పెన్షన్ ఫండ్ రెగ్యులేటరీ అండ్ డెవలప్‌మెంట్ అథారిటీ విడుదల చేసిన తాజా మార్గదర్శకాల ప్రకారం రిటైర్మెంట్ ఇన్‌కమ్ స్కీమ్స్, డ్రాడౌన్ ఎంపికలను కొత్తగా అందుబాటులోకి తీసుకొచ్చింది. దీని ద్వారా పెన్షనర్లకు స్థిరమైన ఆదాయంతో పాటు మార్కెట్ ఆధారిత లాభాలు పొందే అవకాశం కలగనుంది. ఇప్పటి వరకు అమలులో ఉన్న విధానం ప్రకారం ఎన్‌పీఎస్ చందాదారులు రిటైర్మెంట్ సమయంలో తమ మొత్తం కార్పస్‌లో గరిష్ఠంగా 60 శాతం మొత్తాన్ని ఒకేసారి పన్ను లేకుండా ఉపసంహరించుకునే అవకాశం ఉండేది. మిగిలిన 40 శాతం మొత్తంతో యాన్యుటీ కొనుగోలు చేయాల్సి ఉండేది. దాని ఆధారంగానే వారికి నెలవారీ పెన్షన్ అందేది. అయితే ఒకేసారి పెద్ద మొత్తంలో వచ్చిన డబ్బును ఎలా నిర్వహించాలో తెలియక చాలామంది ఇబ్బందులు ఎదుర్కొనేవారు.

కొత్త నిబంధనల ప్రకారం రిటైర్మెంట్ తర్వాత 60 శాతం సొమ్మును ఒకేసారి తీసుకోకుండా ఎన్‌పీఎస్‌లోనే ఉంచి అవసరానికి అనుగుణంగా విడతల వారీగా తీసుకునే అవకాశం కల్పించారు. ఇది మ్యూచువల్ ఫండ్స్‌లో ఉండే సిస్టమేటిక్ విత్‌డ్రా విధానం తరహాలో పనిచేస్తుంది. దీని వల్ల సాధారణ పెన్షన్‌తో పాటు అదనపు నగదు ప్రవాహం కూడా లభించే అవకాశం ఉంటుంది. కొత్తగా తీసుకొచ్చిన రిటైర్మెంట్ ఇన్‌కమ్ స్కీమ్‌లో యాన్యుటీ కొనుగోలు చేసిన తర్వాత మిగిలిన మొత్తాన్ని ఎన్‌పీఎస్‌లోనే కొనసాగించవచ్చు. ఇందులో వయసు పెరిగే కొద్దీ రిస్కును తగ్గించే ప్రత్యేక విధానం ఉంటుంది. ప్రారంభ దశలో ఈక్విటీ పెట్టుబడులు ఎక్కువగా ఉండగా, వయసు పెరిగేకొద్దీ వాటిని తగ్గిస్తూ సురక్షిత పెట్టుబడుల వైపు మార్పులు చేస్తారు.

డ్రాడౌన్ విధానంలో చందాదారులు రెండు పద్ధతుల్లో ఒకదాన్ని ఎంచుకునే అవకాశం ఉంటుంది. ఒకటి నిర్ణీత శాతం ఆధారంగా నగదు పొందే విధానం కాగా, మరొకటి ప్రతి నెలా యూనిట్లను విక్రయించి నగదు రూపంలో పొందే విధానం. మార్కెట్ పరిస్థితులను బట్టి అందే మొత్తం మారే అవకాశం ఉంటుంది. రిటైర్మెంట్ తర్వాత ఆదాయం కొనసాగడంతో పాటు ద్రవ్యోల్బణ ప్రభావాన్ని ఎదుర్కొనేలా ఈ విధానం ఉపయోగపడుతుందని నిపుణులు భావిస్తున్నారు. ఒకేసారి పెద్ద మొత్తం ఖర్చు కాకుండా పొదుపు సొమ్ము ఎక్కువ కాలం నిలవడం ఈ పథకం ప్రధాన ప్రయోజనంగా పేర్కొంటున్నారు. 85 ఏళ్ల వయసు వరకు ఈ అవకాశం అందుబాటులో ఉండనుంది.




# క్రెడిట్ స్కోర్‌పై ప్రభావం చూపేది పెద్ద రుణాలే కాదు..

హైదరాబాద్, మే 18 (తెలంగాణ ముచ్చట్లు): చాలా మంది తమ క్రెడిట్ స్కోర్‌పై ప్రభావం చూపేది కేవలం భారీ రుణాలు లేదా గృహ రుణాలేనని భావిస్తుంటారు. కానీ వాస్తవానికి రోజువారీ ఆర్థిక అలవాట్లే ఒక వ్యక్తి క్రెడిట్ ప్రొఫైల్‌ను ఎక్కువగా ప్రభావితం చేస్తాయని ఆర్థిక నిపుణులు చెబుతున్నారు.

ప్రతి నెలా క్రెడిట్ కార్డ్ బిల్లులు, రుణ ఈఎంఐలను సమయానికి చెల్లించడం మంచి ఆర్థిక క్రమశిక్షణకు సంకేతంగా పరిగణించబడుతుంది. సకాలంలో చెల్లింపులు చేసే వారిని రుణదాతలు బాధ్యతాయుతమైన కస్టమర్లుగా భావిస్తారు.

ఒకటి లేదా రెండు సార్లు ఆలస్యం కావడం పెద్ద సమస్య కాకపోయినా.. తరచూ ఆలస్యమైతే క్రెడిట్ చరిత్రపై ప్రతికూల ప్రభావం పడే అవకాశం ఉంటుంది.

క్రెడిట్ వినియోగం కూడా క్రెడిట్ స్కోర్‌లో కీలక పాత్ర పోషిస్తుంది. మీకు ఇచ్చిన మొత్తం క్రెడిట్ పరిమితిలో ఎంత శాతం వినియోగిస్తున్నారన్నది రుణ సంస్థలు గమనిస్తాయి. ఎప్పుడూ పరిమితికి దగ్గరగా క్రెడిట్ వినియోగిస్తే.. అది అధిక అప్పులపై ఆధారపడుతున్నట్లు సంకేతం ఇస్తుంది.

సాధారణంగా తక్కువ శాతం క్రెడిట్ వినియోగం ఆర్థిక నియంత్రణకు సూచికగా భావిస్తారు.

ఇక చాలా మంది క్రెడిట్ కార్డుల్లో కనీస బకాయి మాత్రమే చెల్లిస్తూ కొనసాగుతుంటారు. ఇది తాత్కాలికంగా ఉపశమనం ఇచ్చినా.. దీర్ఘకాలంలో భారీ వడ్డీ భారాన్ని పెంచుతుంది. అలాంటి అలవాటు కొనసాగితే ఆర్థిక స్థిరత్వంపై కూడా ప్రభావం పడుతుంది.

తరచూ కొత్త రుణాలు లేదా క్రెడిట్ కార్డుల కోసం దరఖాస్తు చేయడం కూడా మంచిది కాదని నిపుణులు సూచిస్తున్నారు. ప్రతి దరఖాస్తు క్రెడిట్ రిపోర్ట్‌లో నమోదవుతుంది. తక్కువ సమయంలో ఎక్కువ దరఖాస్తులు చేస్తే.. అత్యవసరంగా డబ్బు అవసరమని రుణదాతలు భావించే అవకాశం ఉంటుంది.

పాత క్రెడిట్ ఖాతాలు కూడా క్రెడిట్ చరిత్రలో ముఖ్యమైన పాత్ర పోషిస్తాయి. చాలా కాలంగా సక్రమంగా నిర్వహిస్తున్న ఖాతాలు ఆర్థిక స్థిరత్వానికి సూచికగా పరిగణించబడతాయి. అందుకే పాత ఖాతాలను తొందరగా మూసివేయకూడదని నిపుణులు సూచిస్తున్నారు.

క్రెడిట్ స్కోర్ ఒక్కరోజులో మెరుగుపడదని, అది సంవత్సరాల పాటు కొనసాగిన ఆర్థిక అలవాట్ల ఫలితమని ఆర్థిక విశ్లేషకులు చెబుతున్నారు. సమయానికి చెల్లింపులు చేయడం, మితంగా క్రెడిట్ వినియోగించడం, అవసరమైనప్పుడే రుణాలు తీసుకోవడం వంటి మంచి అలవాట్లు భవిష్యత్తులో బలమైన ఆర్థిక విశ్వసనీయతను నిర్మిస్తాయని పేర్కొం

తెలంగాణ TELANGANA MUCHATLU ముచ్చట్లు
ఎడిటర్ : బొల్లెపాక రాజేష్ తెలుగు దిన పత్రిక

# పూజారుల వేతనాల పిల్‌పై నిరాకరణ



- విచారణకు సుప్రీంకోర్టు విముఖత
- ప్రభుత్వ ఆలయ సిబ్బంది వేతనాలపై పిటిషన్
- సంబంధిత అధికారులను ఆశ్రయించేందుకు సూచన

**న్యూఢిల్లీ, మే 18 (తెలంగాణ ముచ్చట్లు):** దేశవ్యాప్తంగా ప్రభుత్వ నియంత్రణలో ఉన్న ఆలయాల్లో పనిచేస్తున్న పూజారులు, సేవాదార్లు, ఇతర సిబ్బందికి ఏకరీతి వేతనాలు, సంక్షేమ ప్రణాళిక రూపొందించాలని కోరుతూ దాఖలైన ప్రజా ప్రయోజన వ్యాజ్యంపై సుప్రీంకోర్టు విచారణకు నిరాకరించింది. ఈ అంశంలో తాము జోక్యం చేసుకోలేమని స్పష్టం చేస్తూ ధర్మాసనం కీలక వ్యాఖ్యలు చేసింది. జస్టిస్ విక్రమ్ నాథ్, జస్టిస్ సందీప్ మెహతాతో కూడిన ధర్మాసనం ఈ పిటిషన్‌ను విచారించింది. ప్రభుత్వ ఆధీనంలోని ఆలయాల్లో పనిచేస్తున్న పూజారులు, ఇతర సిబ్బంది వేతనాలు, సేవా నిబంధనలను సమీక్షించేందుకు జ్యుడీషియల్ కమిషన్ లేదా నిపుణుల కమిటీ ఏర్పాటు చేయాలని పిటిషనర్ కోరారు. న్యాయవాది అశ్విని ఉపాధ్యాయ్ దాఖలు చేసిన పిటిషన్‌లో వేతనాల కోడ్-రెండు వేల పంతొమ్మిది చట్టం ప్రకారం పూజారులను ఉద్యోగులుగా గుర్తించాలని విజ్ఞప్తి చేశారు. కనీస వేతనాలతో పాటు కార్మిక సంక్షేమ రక్షణలు, పెన్షన్, ఆరోగ్య భద్రత వంటి సౌకర్యాలు కల్పించాలని ఆయన కోరారు.

ఆంధ్రప్రదేశ్, తెలంగాణ, తమిళనాడు, కర్ణాటక, కేరళ రాష్ట్రాల్లో ఆలయ సిబ్బంది నామమాత్రపు గౌరవ వేతనాలతో జీవిస్తున్నారని పిటిషన్‌లో పేర్కొన్నారు. కొందరు కేవలం దక్షిణలపైనే ఆధారపడుతున్నారని, వారికి సామాజిక భద్రతా ప్రయోజనాలు అందడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. ఆలయాల పరిపాలన, ఆర్థిక వ్యవహారాలపై ప్రభుత్వాలు పూర్తి నియంత్రణ కలిగి ఉన్నప్పుడు ఉద్యోగ సంబంధం ఏర్పడుతుందని పిటిషనర్ వాదించారు. ఇలాంటి పరిస్థితుల్లో కార్మిక సంక్షేమ ప్రయోజనాలు కల్పించకపోవడం రాజ్యాంగ హక్కుల ఉల్లంఘనగా పరిగణించాలని అభ్యర్థించారు. అయితే ఈ అంశంలో న్యాయస్థానం జోక్యం చేసుకోవడం సాధ్యం కాదని ధర్మాసనం అభిప్రాయపడింది. అనంతరం సంబంధిత అధికారులను ఆశ్రయించేందుకు స్వేచ్ఛనిస్తూ పిటిషన్‌ను ఉపసంహరించుకునేందుకు అనుమతి ఇచ్చింది. దీంతో పిటిషనర్ స్వయంగా ఉపసంహరించుకున్న కారణంగా వ్యాజ్యాన్ని కొట్టివేస్తున్నట్లు సుప్రీంకోర్టు స్పష్టం చేసింది.




## ఉత్తరప్రదేశ్‌లో ఘోర రోడ్డు ప్రమాదం

- వ్యాన్–ట్రక్కు ఢీకొని పది మంది మృతి
- లఖింపూర్ జాతీయ రహదారిపై విషాదం
- బాధిత కుటుంబాలకు పరిహారం ప్రకటన

**లక్నో, మే 18 (తెలంగాణ ముచ్చట్లు):** ఉత్తరప్రదేశ్‌లో ఘోర రోడ్డు ప్రమాదం చోటుచేసుకుని పది మంది ప్రాణాలు కోల్పోయారు. సిసయ్య-లఖింపూర్ జాతీయ రహదారిపై జరిగిన ఈ ప్రమాదం తీవ్ర విషాదాన్ని మిగిల్చింది. లఖింపూర్ నుంచి సిసయ్య వైపు వెళ్తున్న ఓ వ్యాన్ ఎదురుగా వస్తున్న ట్రక్కును ఢీకొనడంతో ఈ దుర్ఘటన చోటుచేసుకుంది. ఉంచ్‌గావ్, బారెహతా గ్రామాల మధ్య జరిగిన ఈ ప్రమాదంలో వ్యాన్‌లో ప్రయాణిస్తున్న తొమ్మిది మంది ప్రయాణికులు, ఒక డ్రైవర్ అక్కడికక్కడే మృతి చెందినట్లు అధికారులు తెలిపారు. ప్రమాద తీవ్రత ఎక్కువగా ఉండటంతో వాహనం పూర్తిగా ధ్వంసమైనట్లు సమాచారం. ప్రాథమిక సమాచారం ప్రకారం ఎదురెదురుగా వస్తున్న వాహనాలు ఢీకొనడం వల్ల ప్రమాదం సంభవించినట్లు అధికారులు తెలిపారు. సమాచారం అందుకున్న పోలీసులు, సహాయక బృందాలు వెంటనే సంఘటన స్థలానికి చేరుకుని సహాయక చర్యలు చేపట్టారు.

ప్రమాదంలో గాయపడిన వారిని సమీప ఆసుపత్రులకు తరలించి చికిత్స అందిస్తున్నారు. ప్రమాదానికి గల కారణాలపై పోలీసులు దర్యాప్తు ప్రారంభించారు. రహదారిపై కొంతసేపు రాకపోకలకు అంతరాయం ఏర్పడింది. ఈ ఘటనపై ఉత్తరప్రదేశ్ ముఖ్యమంత్రి యోగి ఆదిత్యనాథ్ తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. ప్రమాదంలో ప్రాణాలు కోల్పోయిన వారి కుటుంబాలకు సానుభూతి తెలిపారు. గాయపడిన వారికి తక్షణ వైద్య సహాయం అందించాలని స్థానిక అధికారులను ఆదేశించారు. మృతుల కుటుంబాలకు రెండు లక్షల రూపాయల పరిహారం ప్రకటించిన ముఖ్యమంత్రి, మృతుల ఆత్మకు శాంతి చేకూరాలని ప్రార్థించారు. ఈ ఘటనపై రాష్ట్రవ్యాప్తంగా విషాద ఛాయలు అలుముకున్నాయి.




## ముఖ్యమంత్రిని కలిసిన విద్యార్థి సంఘం నేతలు

- డిమాండ్ల పత్రం సమర్పించి చర్చలు
- విద్యార్థి సమస్యలపై వినతులు
- సచివాలయంలో ముఖ్యమంత్రితో భేటీ

**చెన్నై, మే 18 (తెలంగాణ ముచ్చట్లు):** తమిళనాడు సచివాలయంలో రాష్ట్ర ముఖ్యమంత్రి ఎస్. జోసెఫ్ విజయ్ను భారత విద్యార్థి సంఘం రాష్ట్ర నాయకులు కలిశారు. రాష్ట్ర అధ్యక్షురాలు మిరుదుల, రాష్ట్ర కార్యదర్శి సంషీర్ అహ్మద్‌తో పాటు ఇతర కార్యవర్గ సభ్యులు సమావేశంలో పాల్గొని పలు అంశాలపై చర్చలు జరిపారు. సోమవారం జరిగిన ఈ సమావేశంలో విద్యార్థులకు సంబంధించిన వివిధ సమస్యలు, అవసరాలు, అభ్యర్థనలపై ముఖ్యమంత్రికి ప్రతినిధులు వినతిపత్రం సమర్పించారు. రాష్ట్రవ్యాప్తంగా విద్యార్థులు ఎదుర్కొంటున్న అంశాలపై ప్రత్యేకంగా దృష్టి సారించాలని కోరినట్లు సమాచారం. ఈ సందర్భంగా విద్య, విద్యార్థి సంక్షేమం, మౌలిక సదుపాయాలు, అభివృద్ధి కార్యక్రమాలకు సంబంధించిన పలు అంశాలు చర్చకు వచ్చినట్లు తెలుస్తోంది. విద్యార్థుల అవసరాలను ప్రభుత్వం పరిగణనలోకి తీసుకోవాలని ప్రతినిధులు కోరారు.

విద్యార్థి సంఘం నాయకుల అభిప్రాయాలను ముఖ్యమంత్రి ఆసక్తిగా విన్నట్లు సమాచారం. విద్యార్థుల అభివృద్ధికి సంబంధించిన అంశాలపై ప్రభుత్వం సానుకూల దృక్పథంతో వ్యవహరిస్తుందని సమావేశంలో పేర్కొన్నట్లు తెలుస్తోంది. రాష్ట్రంలోని విద్యార్థుల సంక్షేమం కోసం ప్రభుత్వం చర్యలు చేపడుతోందని సమావేశంలో చర్చ జరిగినట్లు సమాచారం. విద్యార్థుల సమస్యలను పరిష్కరించే దిశగా ప్రభుత్వం ముందుకు సాగాలని ప్రతినిధులు విజ్ఞప్తి చేశారు. ఈ సమావేశం అనంతరం విద్యార్థి సంఘం నాయకులు ప్రభుత్వానికి తమ డిమాండ్ల పత్రాన్ని అందజేశారు. విద్యార్థుల ప్రయోజనాలకు సంబంధించిన అంశాలపై త్వరలో సానుకూల నిర్ణయాలు వస్తాయని ఆశాభావం వ్యక్తం చేశారు.

# బద్రీనాథ్ యాత్రలో సీఐఎస్ఎఫ్ సేవా కార్యక్రమం

- రక్తదాన శిబిరం నిర్వహించిన సీఐఎస్ఎఫ్ సిబ్బంది
- యాత్రికుల అత్యవసర వైద్య అవసరాలకు తోడ్పాటు
- మానవత్వానికి అంకితభావాన్ని చాటిన భద్రతా బలగం




**డెహ్రాడూన్, మే 18 (తెలంగాణ ముచ్చట్లు):** బద్రీనాథ్ యాత్ర కొనసాగుతున్న నేపథ్యంలో యాత్రికుల అత్యవసర వైద్య అవసరాలను దృష్టిలో పెట్టుకుని సీఐఎస్ఎఫ్ ఆధ్వర్యంలో ప్రత్యేక రక్తదాన శిబిరం నిర్వహించారు. ఉత్తరాఖండ్‌లోని తపోవన్ యూనిట్‌లో నిర్వహించిన ఈ కార్యక్రమం సేవాభావానికి నిదర్శనంగా నిలిచింది. భద్రతా బాధ్యతలతో పాటు సామాజిక సేవల్లో కూడా సీఐఎస్ఎఫ్ ముందుంటుందని మరోసారి నిరూపితమైంది. ఈ కార్యక్రమాన్ని శ్రీనగర్‌లోని హెచ్ఎన్‌బీ బేస్ ఆసుపత్రి రక్త బ్యాంకు విభాగం సహకారంతో నిర్వహించారు. జాతీయ థర్మల్ విద్యుత్ సంస్థ ఆరోగ్య కార్యక్రమం ‘ఆహ్వాహన్’లో భాగంగా ఈ రక్తదాన శిబిరాన్ని ఏర్పాటు చేశారు. యాత్రాకాలంలో తలెత్తే అత్యవసర పరిస్థితుల్లో రక్త అవసరాలను తీర్చేందుకు ఈ కార్యక్రమం ఉపయోగపడుతుందని అధికారులు తెలిపారు. రక్తదాన కార్యక్రమంలో సీఐఎస్ఎఫ్ సిబ్బంది స్వచ్ఛందంగా పాల్గొని పెద్ద సంఖ్యలో రక్తదానం చేశారు. భద్రత కల్పించడమే కాకుండా సమాజానికి అవసరమైన సందర్భాల్లో సేవలు అందించడం తమ బాధ్యతగా భావిస్తున్నట్లు సిబ్బంది పేర్కొన్నారు.

ఈ సందర్భంగా అధికారులు మాట్లాడుతూ ప్రజల భద్రతతో పాటు మానవత్వం, సేవా దృక్పథం కూడా సీఐఎస్ఎఫ్ ప్రధాన లక్ష్యాలలో భాగమని తెలిపారు. అత్యవసర పరిస్థితుల్లో ప్రజల ప్రాణాలను కాపాడేందుకు ఇలాంటి కార్యక్రమాలు ఎంతో ఉపయోగపడతాయని పేర్కొన్నారు. ప్రస్తుతం బద్రీనాథ్ యాత్ర కొనసాగుతున్న నేపథ్యంలో లక్షలాది మంది భక్తులు ఉత్తరాఖండ్‌కు చేరుకుంటున్నారు. ఈ క్రమంలో ఆరోగ్య సేవలు, అత్యవసర వైద్య అవసరాల కోసం ముందస్తు ఏర్పాట్లు చేయడం కీలకమని అధికారులు తెలిపారు. సమాజం పట్ల బాధ్యత, సేవాభావం, మానవత్వం సీఐఎస్ఎఫ్ ప్రత్యేకతగా నిలుస్తున్నాయని అధికారులు పేర్కొన్నారు. రక్తదానం ద్వారా ప్రాణాలను కాపాడే గొప్ప కార్యక్రమంలో పాల్గొన్న సిబ్బందిని అభినందించారు.

# భవిష్యత్ తరాలకు నీరు ఉంటుందా?

- పెరుగుతున్న నీటి సంక్షోభం భవిష్యత్తుపై ఆందోళన
- భూగర్భ జలాలపై పెరుగుతున్న ఆధారపడటం
- వాతావరణ మార్పులతో తీవ్రతరమవుతున్న పరిస్థితులు
- నీటి సంరక్షణే రేపటి తరాలకు భరోసా



**డెస్క్, మే 18 (తెలంగాణ ముచ్చట్లు):** ప్రపంచవ్యాప్తంగా నీటి సంక్షోభం రోజురోజుకూ తీవ్రమవుతోంది. ఒకప్పుడు అపారంగా అందుబాటులో ఉండే సహజ వనరుగా భావించిన నీరు ఇప్పుడు భవిష్యత్తులో అత్యంత విలువైన వనరుగా మారే పరిస్థితులు కనిపిస్తున్నాయి. జనాభా పెరుగుదల, పట్టణీకరణ, పరిశ్రమల విస్తరణ, వాతావరణ మార్పులు కలిసి నీటి వనరులపై తీవ్ర ఒత్తిడిని సృష్టిస్తున్నాయి. దీంతో రాబోయే తరాలకు సరిపడా నీరు అందుబాటులో ఉంటుందా అనే ప్రశ్న ఇప్పుడు ప్రపంచవ్యాప్తంగా చర్చనీయాంశంగా మారుతోంది.

దేశంలో ముఖ్యంగా భూగర్భ జలాల వినియోగం వేగంగా పెరుగుతోంది. వ్యవసాయం, తాగునీటి అవసరాలు, పరిశ్రమల కోసం అధికంగా బోర్లపై ఆధారపడటం వల్ల భూమిలోని నీటి మట్టాలు క్రమంగా తగ్గుతున్నాయి. అనేక ప్రాంతాల్లో వేసవి ప్రారంభం కాకముందే బోర్లు ఎండిపోతున్నాయి. గ్రామీణ ప్రాంతాల నుంచి పెద్ద నగరాల వరకు నీటి కొరత సమస్య కనిపిస్తోంది. పెరుగుతున్న నగరీకరణ కూడా నీటి వనరులపై ప్రభావం చూపుతోంది. చెరువులు, కుంటలు, వాగులు ఆక్రమణలకు గురవుతుండటంతో సహజ నీటి నిల్వ వ్యవస్థ దెబ్బతింటోంది. ఒకప్పుడు వర్షపు నీరు భూమిలోకి చేరి భూగర్భ జలాలను పెంచేది. కానీ ఇప్పుడు కాంక్రీట్ నిర్మాణాలు పెరగడంతో నీరు నేరుగా కాలువల్లోకి వెళ్లిపోతున్న పరిస్థితి ఏర్పడుతోంది.

మరోవైపు వాతావరణ మార్పులు నీటి సమస్యను మరింత క్లిష్టంగా మారుస్తున్నాయి. వర్షపాతం సరళిలో మార్పులు కనిపిస్తున్నాయి. కొన్ని ప్రాంతాల్లో భారీ వర్షాలు కురుస్తుంటే మరికొన్ని ప్రాంతాల్లో తీవ్ర ఎండలు నమోదవుతున్నాయి. ఈ మార్పులు నీటి లభ్యతపై ప్రభావం చూపుతున్నాయని నిపుణులు హెచ్చరిస్తున్నారు. నీటి సమస్యకు కేవలం ప్రభుత్వ చర్యలు మాత్రమే సరిపోవని నిపుణులు సూచిస్తున్నారు. వర్షపు నీటి సేకరణ, నీటి వృథాను తగ్గించడం, చెరువుల పునరుద్ధరణ, భూగర్భ జలాల పరిరక్షణ వంటి చర్యల్లో ప్రజల భాగస్వామ్యం కూడా అవసరమని చెబుతున్నారు.

భవిష్యత్ తరాలకు నీటి భద్రత కల్పించాలంటే ఇప్పుడే ఆలోచించి చర్యలు తీసుకోవాల్సిన అవసరం ఉంది. ప్రకృతి ఇచ్చిన ప్రతి నీటి బొట్టు విలువైనదే. దానిని సంరక్షించడం ప్రస్తుత తరాల బాధ్యతగా మారింది. లేకపోతే రాబోయే కాలంలో నీటి కోసం పెద్ద సవాళ్లు ఎదుర్కోవాల్సి వచ్చే పరిస్థితులు ఏర్పడే అవకాశాలు ఉన్నాయని నిపుణులు హెచ్చరిస్తున్నారు.

# దేశంలో వరుస రైలు ప్రమాదాలు

- మళ్లీ అగ్నికీలల్లో రైలు
- బీహార్‌లో ప్యాసింజర్ రైలు కోచ్‌లో భారీ అగ్నిప్రమాదం
- కాలిపోయిన బోగి.. ప్రయాణికుల్లో తీవ్ర భయాందోళన
- రైల్వే భద్రతపై దేశవ్యాప్తంగా మళ్లీ ఆందోళన




**పాట్నా, మే 18 (తెలంగాణ ముచ్చట్లు):** దేశవ్యాప్తంగా ఇటీవల రైళ్లలో వరుసగా అగ్నిప్రమాదాలు, ప్రమాద ఘటనలు చోటుచేసుకుంటున్న నేపథ్యంలో మరోసారి బీహార్‌లో జరిగిన రైలు అగ్నిప్రమాదం కలకలం రేపింది. సోమవారం ఉదయం ససారం రైల్వే స్టేషన్‌లో నిలిచి ఉన్న ససారం-పాట్నా ఫాస్ట్ ప్యాసింజర్ రైలు కోచ్‌లో ఒక్కసారిగా మంటలు చెలరేగడంతో ప్రయాణికులు తీవ్ర భయాందోళనకు గురయ్యారు. కొద్ది క్షణాల్లోనే మంటలు భారీగా వ్యాపించి కోచ్ మొత్తం అగ్నికి ఆహుతి కావడంతో స్టేషన్ పరిసరాల్లో ఉద్రిక్త పరిస్థితులు నెలకొన్నాయి. సమాచారం ప్రకారం ఉదయం ఆరు గంటల సమయంలో ససారం రైల్వే స్టేషన్ ఆరో నంబర్ ప్లాట్‌ఫారమ్‌పై రైలు నిలిచి ఉంది. సాధారణంగా ప్రయాణికులు తమ ప్రయాణాలకు సిద్ధమవుతుండగా అకస్మాత్తుగా ఒక కోచ్‌లో నుంచి పొగలు రావడం ప్రారంభమైంది. మొదట చిన్నగా కనిపించిన మంటలు క్రమంగా తీవ్రరూపం దాల్చి కోచ్ మొత్తం వ్యాపించాయి. మంటలు ఎగసిపడుతున్న దృశ్యాలు చూసిన ప్రయాణికులు భయంతో పరుగులు తీశారు.

ఘటన సమాచారం అందుకున్న రైల్వే భద్రతా సిబ్బంది, స్థానిక పోలీసులు, అగ్నిమాపక సిబ్బంది అత్యవసరంగా అక్కడికి చేరుకుని సహాయక చర్యలు చేపట్టారు. మంటలు మరిన్ని బోగీలకు వ్యాపించకుండా వెంటనే చర్యలు ప్రారంభించారు. పరిస్థితి అదుపులోకి తీసుకురావడానికి అగ్నిమాపక సిబ్బంది తీవ్రంగా శ్రమించారు. కొంతసేపటి పాటు స్టేషన్ మొత్తం అప్రమత్త స్థితిలోకి వెళ్లింది. అగ్నిమాపక సిబ్బంది మంటలను అదుపులోకి తీసుకొచ్చే సమయానికి కోచ్ పూర్తిగా కాలిపోయింది. అనంతరం ప్రమాదానికి గురైన బోగిని మిగిలిన రైలు నుంచి వేరు చేశారు. ప్రయాణికుల భద్రతను దృష్టిలో ఉంచుకుని మిగిలిన బోగీలను పరిశీలించి ప్రత్యేక తనిఖీలు నిర్వహించారు. ముందస్తు జాగ్రత్తలతో మరింత పెద్ద ప్రమాదం తప్పిందని అధికారులు తెలిపారు.

ప్రాథమికంగా షార్ట్ సర్క్యూట్ కారణంగానే ఈ అగ్నిప్రమాదం జరిగి ఉండవచ్చని అధికారులు అనుమానిస్తున్నారు. అయితే సాంకేతిక లోపం, నిర్వహణ సమస్యలు లేదా ఇతర కారణాలు ఉన్నాయా అనే కోణాల్లో కూడా దర్యాప్తు కొనసాగిస్తున్నారు. ఇటీవల దేశంలోని పలు ప్రాంతాల్లో రైళ్లలో అగ్నిప్రమాదాలు చోటుచేసుకుంటున్న నేపథ్యంలో ఈ ఘటన మరింత ప్రాధాన్యం సంతరించుకుంది. ఈ ఘటనలో ఎలాంటి ప్రాణనష్టం జరగకపోవడం పెద్ద ఊరటనిచ్చే అంశంగా నిలిచింది. అయితే రైల్వే కోచ్‌లలో భద్రతా ప్రమాణాలు, విద్యుత్ వ్యవస్థల నిర్వహణపై మరోసారి ప్రశ్నలు తలెత్తుతున్నాయి. మరోవైపు కోచ్‌లో మంటలు భారీగా ఎగిసిపడుతున్న దృశ్యాలు సామాజిక మాధ్యమాల్లో వైరల్‌గా మారాయి. రైల్వే భద్రతను మరింత బలోపేతం చేయాల్సిన అవసరం ఉందని ప్రయాణికులు అభిప్రాయపడుతున్నారు.

Printed,Published and Owned by RAJESH BOLLEPAKA,Printed at Amulya Publications and Printers Graphics,H.No:2-19/1,Thatikayala,Dharmasagar,Hanmakonda,506151 and Published at H.No:2-19/1,Thatikayala,Dharmasagar, Hanmakonda,506151.Editor:BOLLEPAKA RAJESH.RNI:TELTEL/2023/88710.Contact:9493669669.Email:telanganamuchatlu.in@gmail.com.Website:www.telanganamuchatlu.in